



మంగళాద్రికి.. మాస్టర్‌ప్లాన్



- రూ.150 కోట్లతో ప్రణాళిక రూపకల్పన
- నారసింహక్షేత్రంగా మంగళగిరి అభివృద్ధి
- కాశీ కారిడార్ తరహాలో అభివృద్ధిపై లోకేశ్ ఫోకస్

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

అభివృద్ధి అంటే సమగ్రంగా.. సంపూర్ణంగా ఉండాలన్న పట్టుదలతో మంగళగిరిని అన్ని రంగాలలో అభివృద్ధి పట్టాలెక్కించే దిశగా మంత్రి లోకేశ్ అడుగులు వేస్తున్నారు. ఆధ్యాత్మిక క్షేత్రమైన మంగళగిరికి రావాల్సినంత గుర్తింపు రాలేదని లోకేశ్ భావిస్తున్నారు. ఈ క్రమంలో పురాతన, అద్వితీయ క్షేత్రమైన మంగళాద్రి అభివృద్ధికి ఆయన ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇటీవలే కాశీ కారిడార్‌ను లోకేశ్ సందర్శించి అక్కడి అభివృద్ధిని పరిశీలించారు. ఆ స్ఫూర్తితో మంగళగిరి క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా మాస్టర్‌ప్లాన్ తయారు చేసి అమలుకు సిద్ధమయ్యారు.

నెల రోజుల్లో సిద్ధం..

మంగళాద్రిని త్రి నారసింహ క్షేత్రంగా అభివృద్ధి చేసే మాస్టర్‌ప్లాను నెలరోజుల్లో రూపుదిద్దుకోనుంది. మాస్టర్‌ప్లాను రూపకల్పన కోసం దేవదాయ, ఆగమ, పర్యాటకశాఖల అధికారులు, ఇతర ఇంజనీరింగ్ నిపుణులు, కన్సల్టెంట్లతో లోకేశ్ ఇప్పటికి మూడు సార్లు సమావేశమయ్యారు. పురాతన కట్టడాల రూపు చెదరకుండా, ఆగమశాస్త్రానుసారం వాస్తు నిబంధనలకు, వేద పండితుల అభిప్రాయాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాను ఉండాలని అధికారులకు లోకేశ్ సూచించారు. మంగళాద్రి అభివృద్ధి కోసం ఇంచుమించు రూ.150 కోట్లను వివిధ పథకాల కింద వ్యయం చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

అభివృద్ధి ఇలా..

మాస్టర్‌ప్లాను ప్రకారం మంగళాద్రిని త్రి నారసింహక్షేత్రంగా అభివృద్ధి చేయనున్నారు. దిగువ, ఎగువ సన్నిధితోపాటు గండాలయస్వామి(జ్వాలా నృసింహస్వామి) సన్నిధిని అభివృద్ధి చేయనున్నారు. జాతీయ రహదారి నుంచి వయా ఎగువ సన్నిధి పక్కగా శిఖరంపై ఉన్న గండాలయస్వామి సన్నిధి వరకు కొత్తగా ఇంకో ఘాట్‌రోడ్డును ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. శిఖరంపై వసతి సదుపాయాలతోపాటు పర్యాటకంగా యాత్రికులను ఆకర్షించేలా ఏర్పాట్లు చేయాలని లోకేశ్ కన్సల్టెంట్లకు సూచించారు. పానకాల నృసింహస్వామి ఆలయ ముఖమండపం, పార్కింగ్ స్థలాన్ని విస్తరించాలని ప్రతిపాదించారు. ఘాట్‌రోడ్డు మార్గంలో రివిట్‌మెంట్ చేయాలని, గ్రీనరీ అభివృద్ధి చేయాలని సూచించారు. దిగువ సన్నిధిలో స్వామివారి, రాజ్యలక్ష్మి అమ్మవార్ల విమాన గోపురాలను ఆకర్షణీయంగా అభివృద్ధి చేయాలని, ముఖమండపాన్ని పునర్ నిర్మించాలని, యాగశాలను ప్రస్తుత కార్యనిర్వహణాధికారి కార్యాలయం స్థానంలో ఏర్పాటు చేయాలని, వాహనశాలను ఆలయానికి వెనుక వైపున జానకమ్మ సత్రం స్థలంలో కొత్తగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయాన్ని సత్రం ప్రాంగణంలో నిర్మించేలా ప్రతిపాదించారు. ప్రభుత్వాస్పత్రి స్థలంలో యాత్రికుల వసతి గృహాలను నిర్మించి పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించాలని ప్రతిపాదించారు. వేంకటేశ్వరస్వామి ఆలయానికి దక్షిణంగా ఇండోర్ స్టేడియాన్ని హరికథా కాలక్షేపం, సాంస్కృతిక కార్యకలాపాల కోసం ఏర్పాటు చేయనున్నారు. మంగళాద్రి క్షేత్ర ఇతిహాసం, చరిత్ర భక్తులకు తెలియజేసేందుకు భోజనశాలకు వెనుకవైపు మ్యూజియం నిర్మించాలని ప్రతిపాదించారు. ఆలయ మాడవీధులను, ప్రధాన వీధులను విస్తరించాలని నిర్ణయించారు. క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామికి ప్రాధాన్యం ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ఉపాలయాలను, ఉత్సవ గ్రౌండును అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు.

ఇకపై రాష్ట్రపండుగగా తిరునాళ్లు

చరిత్రలో నిలిచేలా ఏటా మంగళగిరి తిరునాళ్లను(నృసింహుని రథోత్సవం) అత్యంత వైభవంగా నిర్వహించాలని లోకేశ్ ప్రతిపాదించారు. ఇందుకు అనుగుణంగా మంగళగిరి తిరునాళ్లను రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ చెప్పారు.

నిధుల సమీకరణ ఇలా...

మాస్టర్‌ప్లాను ప్రకారం క్షేత్రాభివృద్ధికి కేంద్ర పర్యాటకశాఖకు చెందిన శాస్త్రీ పథకం కింద రూ75 కోట్లు రాబట్టేవిధంగా లోకేశ్ కృషి చేస్తున్నారు. మంగళగిరి దేవస్థానం ఖాతాలో ప్రస్తుతానికి రూ.80 కోట్లకు పైగా నిధులున్నాయి. ఈ నిధులను ఎంతమేర ఖర్చు చేయవచ్చో అంతమేర ఖర్చు చేయాలని యోచిస్తున్నారు. మరికొన్ని నిధులను రాష్ట్రప్రభుత్వం నుంచి, ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి రాబట్టాలని భావిస్తున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.24 (శుక్రవారం సాయంత్రం)
సహరి : 4.55 (శనివారం ఉదయం)

జడ్పీకి.. బకాయిల భారం

- రావాల్సిన అద్దెలు 1.22 కోట్లు
- అతిథిగృహాల్లో పేరుకుపోయిన బాకీలు
- వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్

8

ఒకటికి మించి

- యార్డులో కొన్ని కుటుంబాలకు ఒకటి కంటే ఎక్కువ లైసెన్సులు
- మార్కెటింగ్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ విజయ సునీత

మేయర్ నానీయే

- యువనేత నారా లోకేశ్ గ్రీన్‌సిగ్నల్
- ఇప్పటికే కేంద్రమంత్రి పెమ్మసానికి సూచనలు
- శ్రీరామనవమి తర్వాతనే కొత్త మేయర్ ఎన్నిక
- తాత్కాలిక మేయర్‌పై నేడు అందనున్న ఉత్తర్వులు
- ప్రత్యేక కౌన్సిల్ సమావేశం మంగళవారం జరిగే అవకాశం

గుంటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల్లో మేయర్ ఎన్నిక జరిగే అవకాశం ఉన్నందున కూటమి తరపున మేయర్ అభ్యర్థి ఎవరనే అంశంపై టీడీపీ యువనేత, మంత్రి నారా లోకేశ్ క్లారిటీ ఇచ్చినట్లు సమాచారం. నగరపాలక సంస్థ ఎన్నికల సమయంలో మేయర్ అభ్యర్థిగా నిలిచిన టీడీపీ సీనియర్ నేత కోవెలమూడి రవీంద్ర(నాని) పేరునే ఆయన సూచించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఇప్పటికే తెలియజేసి సంబంధిత ఎమ్మెల్యేలకు, కూటమి కార్పొరేటర్లకు తన మాటగా చెప్పి మేయర్ ఎంపిక ఏకగ్రీవంగా జరిగేలా చూడాలని సూచించినట్లు సమాచారం. ఢిల్లీ నుంచి గుంటూరుకు రెండు రోజుల్లో వస్తున్న పెమ్మసాని ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లతో సమావేశం ఏర్పాటు చేసి మేయర్ అభ్యర్థిగా నానీని ప్రకటించే అవకాశం ఉంది. అదే విధంగా మేయర్ పదవిని ఆశిస్తూ కొత్తగా రంగంలోకి దిగిన ఒకరిద్దరిని బుజ్జగించడంతో పాటు, నానీని వ్యతిరేకించే కార్పొరేటర్లను సముదాయించే బాధ్యతను కూడా పెమ్మ సానికి అధిష్ఠానం అప్పగించింది. గత నగరపాలక సంస్థ ఎన్నికల్లో వైసీపీ మేయర్ అభ్యర్థిగా బరిలో నిలిచిన కావటి మనోహర్‌నాయుడును ఢీకొనేందుకు టీడీపీ తరఫున నాని ముందుకు వచ్చిన విషయాన్ని టీడీపీ అధిష్ఠానం గుర్తు పెట్టుకుంది. ఆ ఎన్నికల్లో టీడీపీ పక్షాన నిలిచిన కార్పొరేటర్ అభ్యర్థులకు అవసరమైన ఆర్థిక సహకారం కూడా నానీ భరించిన విషయం గుర్తుపెట్టుకుని ఆ రోజున అనుకున్న ప్రకారం ఆయనకే అవకాశం ఇవ్వాలనే నిర్ణయానికి అధిష్ఠానం వచ్చింది. తాత్కాలిక మేయర్ ఎవరనే ఆదేశాలు ప్రభుత్వం నుంచి రెండు, మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉందని నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. ఆదేశాలు రాగానే ప్రత్యేక కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి కావటి మనోహర్‌నాయుడి రాజీనామాను ఆమోదింపచేయడంతో కొత్త మేయర్ ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఆ రాజీనామా లేఖను ఎలక్షన్ కమిషన్‌కు పంపితే ఎన్నికల తేదీ ప్రకటిస్తుంది. ఇదంతా జరిగి కొత్త మేయర్ పీఠాన్ని అధిష్ఠించడం శ్రీరామనవమి తర్వాతే అయ్యే అవకాశం ఉంది.



కోవెలమూడి రవీంద్ర



షేక్ సజీల

తాత్కాలిక మేయర్ సజీల

ప్రస్తుత మేయర్ కావటి మనోహర్‌నాయుడి రాజీనామాను ఆమోదింపచేసేందుకు, కొత్త మేయర్ ఎన్నిక ప్రక్రియకు సారథ్యం వహించేందుకు తాత్కాలిక మేయర్‌గా ఎవరిని నియమించాలని ప్రభుత్వాన్ని నగరపాలక సంస్థ అధికారులు కోరిన విషయం తెలిసిందే. దీనిపై బుధవారం క్లారిటీ వస్తుందని ఊహించి 20న ప్రత్యేక కౌన్సిల్ నిర్వహించాలని అధికారులు భావించారు. అయితే అసెంబ్లీ సమావేశాల మూలంగా ఈ సమావేశం వాయిదా పడింది. కాగా గురు వారం సాయంత్రం ప్రభుత్వం ఆమోదముద్ర వేసినట్లు నగరపాలక అధికారులకు సమా చారం అందింది. శుక్రవారం ఉత్తర్వులు కాపీ చేరగానే తిరిగి ప్రత్యేక కౌన్సిల్ సమావేశానికి తేదీ నిర్ణయించి నోటీసులు జారీకి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కౌన్సిల్ సమావేశం గురించి కార్పొరేటర్లకు మూడు రోజులు ముందు తెలియజేయాల్సి ఉన్నందున మంగళ, బుధవారాల్లో నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. దీంతో తాత్కాలిక మేయర్ పీఠాన్ని రంజాన్ లోగా షేక్ సజీలకు దక్కనున్నది. కొద్ది రోజుల పాటు ఆమె మేయర్ బాధ్యతలు చేపట్టనున్నారు.





- గుంటూరులో బయ్యర్ల బినామీ వ్యాపారం
- ఒక్క కేంద్రంలోనే 1.80 లక్షల క్వింటాళ్లు కొనుగోలు
- క్వాలిటీ, స్టాండెడ్ కటింగ్ పేరుతో కోత.. కొందరికి రూ.3 కోట్లు లబ్ధి

కొనుగోల్‌మాల్

(గుంటూరు సిటీ - ఆంధ్రజ్యోతి)

కొందరు బయ్యర్లు అత్యధికంగా పత్తి కొనుగోలు చేస్తున్నారు. రైతులకు మేలు చేసేందు కోసం కొనుగోలు చేస్తున్నారని అందరూ అనుకున్నారు. తీరా అసలు విషయం చూస్తే.. ఇదో పెద్ద కొను'గోల్‌మాల్' అని తేలింది. వారి అసలు గోల్ (లక్ష్యం) అర్థమయ్యాక అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. గుంటూరు పరిధిలోని సీసీఐ(కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోలు కేంద్రాల్లో భారీ అక్రమాలు చోటు చేసుకు న్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ఒకే ఒక్క కేంద్రంలో అధికంగా కొనుగోళ్లు జరిగినట్లు వెలుగులోకి రావడం సంచలనంగా మారింది. జిన్నింగ్ మిల్లులు యజమానుల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని గాయత్రీ కాటన్ ప్రొడక్ట్స్, శ్రీ సాయి ట్రేడర్స్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ పత్తి కొనుగోలుకు ఇద్దరు బయ్యర్లు మారారు. గాయత్రీ కాటన్ ప్రొడక్టులో అతి తక్కువగా 4626.75 క్వింటాళ్లు, శ్రీ సాయి ట్రేడర్స్‌లో 20281 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారు. అతి తక్కువగా పత్తి కొనుగోలు చేయడం వల్ల యార్డుకు వచ్చిన ఆదాయం కూడా కేవలం రూ.17 లక్షలు మాత్రమే. ఇదే మిల్లులకు అతి సమీపంలో గుంటూరు-ఏ, గంపలగూడెం యార్డులకు చెందిన జిన్నింగ్ మిల్లుల్లో భారీగా కొనుగోలు జరిగింది. ఇక్కడ వేరే వ్యక్తులు మిల్లులు అద్దెకు తీసుకుని జిన్నింగ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ కేంద్రాల వెనుక బయ్యర్ల హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ జరిగిన పత్తి కొనుగోళ్ల పరిశీలిస్తే ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కేంద్రాలకు ఎంత అన్యాయం జరిగిందో అర్థం అవుతుంది. ఉదాహరణకు గంపలగూడెం యార్డు పరిధిలోకి వచ్చే ఓ మిల్లులో 87448.16 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయగా, మరో కేంద్రంలో ఏకంగా 1.17 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఒకే ఒక్క కేంద్రంలో సుమారు రూ.86 కోట్ల విలువ చేసే పత్తిని కొన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. గుంటూరు -ఏ కేంద్రాల్లో కూడా ఇదే రీతిలో కొనుగోళ్లు జరిగాయి. వాస్తవానికి జనవరి నెలకు పత్తి రావడం పూర్తిగా తగ్గిపోతుంది. అయితే ఆశ్చర్యంగా గుంటూరు- ఏ, గంపలగూడెం కేంద్రాల్లో అన్ సీజన్‌లో కూడా 5 వేల క్వింటాళ్లకు తగ్గకుండా పత్తిని కొనుగోలు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి.

తెర వెనుక ప్రయోజనం వేరు..

కొన్ని సీసీఐ కేంద్రాల్లో పత్తి ఎక్కువగా కొనుగోలు చేయడంలో తెరవెనుక దాగిన ప్రయోజనాలు మాత్రం వేరుగా ఉన్నాయి. ఎక్కడైతే ఎక్కువ పత్తి కొనుగోలు జరిగిందో అక్కడ క్వాలిటీ, స్టాండెడ్ కటింగ్ పేరుతో కోత బాగా విధించారు. ఆయా కేంద్రాల్లో క్వింటాల్‌కు 5 కిలోల నుంచి 7 కిలోల వరకు కోత విధించారు. ఈ లెక్కన ఒక్క బయ్యర్ 1.80 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తే ఎంత మిగులు ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇలా పక్కకు తీసిన పత్తి జిన్నింగ్ వేయగా వచ్చిన దూదిని విక్రయించారు. ప్రస్తుతం ఆరోపణలు వస్తున్న ఆయా కేంద్రాల్లో కొందరికి సుమారు రూ.3 కోట్ల వరకు అదనపు లాభాలు వచ్చినట్లు ఆరోపణలున్నాయి.

- అక్రమార్కుల గుండెల్లో రైళ్లు
- గత ఆడిట్‌లో వెలుగుచూసిన అక్రమాలు
- రుణాల పేరిట బ్యాంకు సొమ్ము దారిమళ్లింపు
- రూ.425 కోట్లు గల్లంతు.. మొండిబకాయిలంటున్న అధికారులు
- బ్యాంకు శాఖల్లో అందుబాటులో లేని రుణ గ్రహీతల వివరాలు
- 2022లో సీఐడీ విచారణపై లేఖ.. నాడు అడ్డుకున్న వైసీపీ నేతలు





జీడీసీసీపై.. సభా సంఘం

గుంటూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో గుంటూరు డిస్ట్రిక్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు(జీడీసీసీ)ను నిలువునా దోచేశారు. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ బ్యాంకు సొమ్ము అందిన కాడికి కాజేశారు. అధికారం అండ.. పాలకవర్గం, అధికారుల సహకారంతో అక్రమార్కులు చెలరేగిపోయారు. ఆయా అక్రమాలను గుర్తించినా విచారణలకు అక్రమార్కులు అడ్డుతగులుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో నాడు అధికారాన్ని అడ్డంపెట్టుకుని జీడీసీసీబీని అడ్డంగా దోచేసిన అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. జీడీసీసీబీ అక్రమాలపై సభా సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించింది. దీంతో జీడీసీసీబీలో గత ఐదేళ్లలో అక్రమాలకు పాల్పడిన రాజకీయ నేతలు, అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. జీడీసీసీబీలో జరిగిన ఎన్నో అక్రమాలు గత ఆడిట్ నివేదికలోనే వెలుగుచూశాయి. జీడీసీసీ అక్రమాలపై పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఫిర్యాదుతో ప్రభుత్వం సెక్షన్ 51 విచారణకు ఆదేశించింది. విచారణ అధికారిగా సహకార శాఖ అధికారిని నియమించారు. ఈ విచారణపై కూడా అందరూ పెదవి విరిచారు. దాని వల్ల అక్రమాలు బయటకు రావని ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో సభా సంఘం ఏర్పాటుకు అడుగు పడింది. కొందరు వైసీపీ నేతలు బినామీలు, నకిలీలను అడ్డంపెట్టుకుని రుణాల పేరట జీడీసీసీ, సహకార సంఘాల్లో వందల కోట్లు దారిమళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం సభా సంఘం వేయడంతో అక్రమార్కులపై ఈ సారి తప్పకుండా చర్యలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఎన్నెన్నో అక్రమాలు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 42 జీడీసీసీ బ్యాంకు శాఖలు, 167 సహకార సంఘాలు ఉన్నాయి. వీటిల్లో సుమారు రూ.425 కోట్లు గల్లంతైనట్లు గత ఆడిట్‌లో నిర్ధారించారు. అధికారులు వీటిని మొండిబకాయిలు అని చెబుతున్నారు. అయితే ఆయా రుణ గ్రహీతల వివరాలు బ్యాంకులో అందుబాటులో లేకపోవడంపై అనుమానాలు వస్తున్నాయి. గుంటూరు పరిసర ప్రాంతాల్లోని కోల్డ్ స్టోరేజ్‌లు, ఇతర వ్యాపార సంస్థలను అడ్డంపెట్టుకుని రుణాల పేరిట నాటి అధికార పార్టీ నేతలు బ్యాంకు సొమ్ము దారిమళ్లించారని తెలుస్తోంది. జీడీసీసీ బ్యాంకుతో పాటు, సహకార సంఘాల్లో అక్రమాలు జరుగుతున్నట్లు 2022లోనే అధికారులు గుర్తించారు. అప్పుడే ఓ అధికారి ఆయా అక్రమాలపై సీఐడీ విచారణకు ఆదేశించాలని ప్రభుత్వానికి లేఖ కూడా రాసినట్లు సమాచారం. అయితే ఈ కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించిన ప్రముఖ నేతలు సీఐడీ విచారణకు అడ్డుతగిలినట్లు తెలుస్తుంది. ప్రభుత్వం మారిన తర్వాత జీడీసీసీ వేదికగా సాగిన నకిలీ రుణాల బాగోతాలు అనేకం వెలుగులోకి వచ్చాయి.

గుంటూరు జిల్లాలోని ప్రత్తిపాడు, నల్లపాడు, రెడ్డిపాలెం, గోరంట్ల, కాకుమాను, పెదనందిపాడు, పల్నాడు జిల్లాలోని గురజాల తదితర ప్రాంతాల్లో ఒకరి పేరుతో వేరొకరు రుణాలు పొందినట్లు వెలుగులోకి వచ్చింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో నకిలీ సభ్యుల పేరిట రూ.10.68 కోట్లు రుణాల రూపేణా దారిమళ్లించినట్లు తేలింది. 17 సహకార సంఘాల్లో 184 మంది నకిలీ సభ్యుల పేర్లతో ఈ తంతు కొనసాగింది. రెడ్డిపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రుణాల మంజూరు పేరట జరిగిన అక్రమాలపై సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్, డివిజనల్ సహకార అధికారి విచారణ జరిపారు. ఇక్కడ కమిటీ అనుమతి లేకుండానే 55 మంది నకిలీలను సభ్యులుగా చేర్చుకుని వారిలో 50 మందికి సీసీ, కేసీసీ రుణాలు రూ.2.99 కోట్లు మంజూరు చేశారు. మాచవరం మండలంలోనూ ఇదేవిధంగా జరిగింది. ఈ అక్రమాల్లో జీడీసీసీ బ్యాంకు అధికారులు, సహకార సంఘాల్లోని సిబ్బంది పాత్ర కూడా ఉంది. ఈ మొత్తం వ్యవహారంలో జీడీసీసీబీకి చెందిన 9 మంది మేనేజర్లు, ఆరుగురు అసిస్టెంట్ మేనేజర్లు, ఓ క్యాషియర్, ఐదుగురు సూపర్‌వైజర్లు, మరికొందరు రెవెన్యూ అధికారుల పాత్ర ఉన్నట్లు నిర్ధారించారు. ఈ క్రమంలో బాధ్యులైన అధికారులు సివిల్, క్రిమినల్ చర్యలు నిలువరించాలని కోరుతూ చేసిన విజ్ఞప్తిని హైకోర్టు కొట్టివేసింది.

రేవుల్లో.. రాబందులు

- స్థానిక నాయకుల కబంధ హస్తాల్లో ఇసుక రీచ్‌లు
- ఎలాంటి అనుమతులు లేకుండానే రీచ్‌ల్లోకి ప్రవేశం
- గుంటూరు జిల్లా రీచ్‌ల్లో ఎక్స్‌కవేటర్ల ద్వారా నదిలోనే లోడింగ్
- కన్నెత్తి చూడని పోలీసు, మైనింగ్, రెవెన్యూశాఖల అధికారులు
- సీఎం చంద్రబాబు ఆదేశాలను భేఖాతరు చేస్తున్న నియోజకవర్గాల నేతలు

గుంటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇసుక విషయంలో జోక్యం వద్దు.. ప్రభుత్వ ఉచిత ఇసుకతో వినియోగదారులకు లబ్ధి చేకూరాలి అని ముఖ్యమంత్రి చంద్రబాబు నేతలను హెచ్చరిస్తున్నారు. కానీ జిల్లాలోని ఇసుక రేవులను నేతల అండదండలతో స్థానిక టీడీపీ నాయకులు కబంధ హస్తాల్లోకి తీసుకున్నారు. ఇసుక తవ్వకాలకు అనుమతులు ముగిసిన రేవుల్లో రాత్రింబవళ్లు ఇష్టారాజ్యంగా ఎక్స్‌కవేటర్లు/జేసీబీ యంత్రాలను వినియోగించి టిప్పర్లు, ట్రాక్టర్లలో లోడింగ్ చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే అనుమతులు ఒక చోట పొంది మరో ప్రదేశంలో తవ్వకాలు జరిపి అమ్మేస్తున్నారు. అడపాదడపాగా తప్పితే మైనింగ్, పోలీసు, రెవెన్యూ, నదీ సంరక్షణ విభాగం అధికారులు రీచ్‌ల వైపు కన్నెత్తి చూడకపోతుండటంతో ఇసుక పేరుకు ఉచితం అయినప్పటికీ రవాణా, లోడింగ్ చార్జీల రూపంలో బాదేస్తున్నారు. దీంతో 10 టైర్ల టిప్పర్ (35 టన్నులు) ఇసుకకు రూ.19 వేలు చెల్లించాల్సిన పరిస్థితి వస్తోంది. తాడేపల్లి నుంచి అయితే అంతా ప్రకాశం బ్యారేజ్ డౌన్‌స్ట్రీమ్ కావడంతో వందల ఎకరాల్లో ఇసుక నిల్వలు అందుబాటులో ఉన్నాయి. మరోవైపు బ్యారేజ్ ఎగువున ఇసుక పూడిక బాగా పేరుకుపోవడంతో అమరావతి రాజధాని పరిధిలోని రాయపూడి, పెనుమాక, ఉండవల్లి, తాళ్ళాయపాలెం వద్ద ఇసుక నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. రెండు దశాబ్దాల క్రితం వరకు ఇసుక రీచ్‌లు జిల్లాపరిషత్ ఆధీనంలో ఉండేవి. కాంగ్రెస్ పార్టీ హయాంలో అప్పటి ఎమ్మెల్యేలు రీచ్‌ల ద్వారా వస్తున్న ఆదాయంపై కన్నేశారు. దీంతో అసెంబ్లీలో రీచ్‌ల గురించి ప్రస్తావించి జడ్పీ నుంచి తీసేసి మైనింగ్ శాఖ ఆధీనంలోకి తీసుకొచ్చారు. దీంతో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతల కన్ను ప్రప్రథమంగా ఇసుక రీచ్‌ల పైనే పడుతున్నది.

గుంటూరు నగరానికి ప్రస్తుతం ఎన్‌టీఆర్ జిల్లా నుంచి ఇసుక రవాణా జరుగుతున్నది. టన్నుకు రూ.550 వంతున వసూలు చేస్తున్నారు. ఈ కారణంగా టిప్పర్‌కు రూ.19 వేలు చెల్లించాల్సి వస్తున్నది. ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తున్నప్పటికీ రీచ్‌ల వద్దకు వినియోగదారులు నేరుగా వెళ్లి తెచ్చుకోలేని పరిస్థితి. కొల్లిపర మండలంలోని మున్నంగి, పిడపర్తివారిపాలెం, బొమ్మువానిపాలెంలో ఇసుక నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. అయితే వీటికి ఇచ్చిన అనుమతులు ముగిశాయి. అయినప్పటికీ 40 రోజులుగా ఇక్కడ టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వి తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. దుగ్గిరాల, గొడవర్రు, పెదకొండూరులో అనుమతులు లేనప్పటికీ స్థానిక నాయకులు ఇసుక తవ్వకాలను ఆపడం లేదు.

కంపెనీల నుంచి ఇసుక డిమాండ్ అధికం

కొల్లిపర మండలంలోని కొమ్మమూరు కాలువపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ ఈఈ 22,304 క్యూబిక్ మీటర్ల ఇసుక సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడ బైపాసు రోడ్డు కోసం నవయుగ ఇంజనీరింగ్ సంస్థ 4 వేల మెట్రిక్‌టన్నుల ఇసుక కోరింది. తాడేపల్లి మండలంలోని పాతూరులో 600 కుటుంబాలు జీవనోపాధి కోసం ఇసుక పూడిక తీసి అమ్ముకునేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి పెట్టుకున్నాయి. గుంటూరు జిల్లాలో ఇసుకకి డిమాండ్ విపరీతంగా ఉన్నది. అయితే స్థానిక నేతల హస్తాల్లో రీచ్‌లు ఉన్నందున సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది.



దుగ్గిరాల మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు

ఆధార్ అప్‌డేట్‌కు అవకాశం

గుంటూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గుంటూరు జిల్లాలో 4.95 లక్షల మంది ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో 5 నుంచి 15 ఏళ్ల వయస్సు కలిగిన వారు 2.07 లక్షలు మంది ఉండగా, 15 సంవత్సరాలు పైబడిన వారు 2.88 లక్షల మంది ఉన్నట్లు సమాచారం. 0-6 సంవత్సరాల వయస్సు కలిగిన 9400 మంది పిల్లలకు ఇంతవరకు అసలు ఆధార్ కార్డు లేనట్టు తెలుస్తుంది. వారిలో 6758 మంది పిల్లలకు పుట్టిన తేదీ సర్టిఫికెట్ ఉండి కూడా ఆధార్ కార్డులు పొందక పోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో నూతన ఆధార్ కార్డులు మంజూరు చేసేందుకు, ఉన్నవాటిని అప్‌డేట్ చేసేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ తెలిపారు. ప్రస్తుతం ఆరంభమయిన ఆధార్ కేంద్రాల్లో ఈ నెల 22వ తేదీ వరకు మొదటి విడత, 25 నుంచి 28వ తేదీ వరకు రెండో విడత వరకు ప్రజలకు అవసరం అయిన సేవలు అందిస్తారని తెలిపారు. ప్రతి మండలంలో మూడు గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధార్‌సేవల కోసం జిల్లా వ్యాప్తంగా 64 కేంద్రాలు పని చేస్తున్నాయని ఆయన తెలిపారు.

మార్చి నెల జీతాలు 28వ తేదీనే జమచేయాలి

గుంటూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల చివరి లో రంజాన్, ఉగాది వంటి ముఖ్యమైన పండుగలు ఉన్నందున జీతాలు 28వ తేదీనే జమ అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం గుంటూరులో ఆయన మాట్లాడుతూ 28వ తేదీన జీతాలు జమ చేయడం వల్ల ప్రభుత్వ ఉద్యోగులంతా సంతోషంగా పండుగ నాచరించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఉగాది కానుకగా ఉద్యోగులకు రావాల్సిన డీఏ మంజూరు చేయాలని, తక్షణమే మధ్యంతర భృతిని ప్రకటించాలని, 12వ పే రివిజన్ కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

దుకాణాల వేలం ద్వారా రూ.54 లక్షల ఆదాయం

అమరావతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో వివిధ దుకాణాల లీజుకు సంబంధించి గురువారం ఆలయ ప్రాంగణంలో జరిగిన బహిరంగ వేలంలో రూ. 54.22 లక్షల ఆదాయం లభించింది. గత సంవత్సరం కంటే ఇప్పుడు జరిగిన వేలంలో రూ. 4.78 లక్షల అధిక ఆదాయం లభించినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి పి.సునీల్‌కుమార్ తెలిపారు. కొబ్బరికాయలు, పూజాద్రవ్యాలు అమ్ముకునేందుకు రూ.17.20లక్షలు, వాహనాల పార్కింగ్‌కు రూ.10.61లక్షలు, బొమ్మలు అమ్ముకునేందుకు రూ.3.90లక్షలు, నదీతీరంలో కూల్‌డ్రింక్స్ అమ్ముకునేందుకు రూ.9.09లక్షలు, చెప్పులు భద్రపరుచుకునేందుకు రూ.2.66లక్షలు, తల నీలాలు పోగుచేసుకునేందుకు రూ.20వేలు, కొబ్బరి చిప్పలు పోగుచేసుకునేందుకు రూ.9.51లక్షలు, మొదటి ప్రాకారంలో కూల్‌డ్రింక్స్ అమ్ముకునేందుకు రూ.లక్షా 5 వేలు వేలం పాట ద్వారా ఆదాయం లభించింది. వేలం పాటను పెదకూరపాడు గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వాహణాధికారి సత్యనారాయణరెడ్డి పర్యవేక్షించారు.



వేములూరిపాడులో భూములను పరిశీలిస్తున్న జేసీ భార్గవ్ తేజ

వినుకొండ-గుంటూరు హైవే విస్తరణకు...

భూములను పరిశీలించిన జేసి భార్గవ తేజ

మేడికొండూరు, ఫిరంగిపురం మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వినుకొండ-గుంటూరు జాతీయ రహదారి 554డి నాలుగు లైన్లగా విస్తరించే పనులు ఊపందుకున్నాయి. అందులో భాగంగా జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు భూసేకరణ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ. భార్గవ తేజ మేడికొండూరు, ఫిరంగిపురం మండ లాలలో రహదారి విస్తరణకు అవసరమైన భూములను గురువారం పరిశీలించారు. మేడికొండూరు మండలంలోని డోకిపర్రు, మంగళగిరిపాడు, మేడికొండూరు, ఫిరంగిపురం మండలంలోని పొనుగుపాడు, మేరికపూడి, నుదురుపాడు, వేమవరం, రేపూడి, ఫిరంగిపురం, అమీనాబాద్ గ్రామాలలోని సర్వే నంబర్లను, భూములను స్వరూపాన్ని ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల పరిధిలో భూసేకరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులతో ఆయన మాట్లాడారు. రహదారుల అభివృద్ధి నిమిత్తం భూములు అవసరమవుతున్నందున రైతులు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మేడికొండూరు, ఫిరంగిపురం తహసీల్దార్లు ఎం. హరిబాబు, జే ప్రసాదరావు, సర్వేయర్లు కె. సాంబశివరావు, వెంకటేశ్వర్లు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

ఏప్రిల్ నెలాఖరు వరకు సాగునీరివ్వాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే యరపతినేని



అసెంబ్లీలో మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సాగర్ కుడికాలువ పరిధిలో గుర జాల నియోజకవర్గంలోని అన్ని మేజర్లు, మైనర్ కాల్వలకు వారబందీ పెట్టడం వల్ల నీటి విడుదల నిలిపివేయడం, తగ్గించడంతో మిర్చి పంటలు దెబ్బతింటు న్నాయని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం అసెంబ్లీ లో మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ ఒక్క కాలువ కూడా బాగు చేయకపోవడం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన తాను తమ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన రెండు నెలల్లో నియోజకవర్గపరిధిలోని అన్ని మేజర్లు, మైనర్ కాల్వలను బాగు చేయించామని యరపతినేని తెలిపారు. నీటి విడుదల తగ్గించ డం, నిలిపివేయడం వల్ల చివరి భూముల్లో సాగుచేస్తున్న మిర్చి, వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. వేసవి కాలం వచ్చినందున గ్రామ, పట్టణ పరిధిలోని చెరువులు, కుంటలను నీటితో నింపి వేసవిలో తాగు నీరు ఎద్దడి లేకుండా గ్రామ, పట్టణ స్థాయి అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కోరడంతో పాటు ఏప్రిల్ నెలాఖరు వరకు సాగర్‌నీరు నిరాటంకంగా విడుదల చేయాలని కోరారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో..

మహిళా ఉద్యోగి హత్య

పిడుగురాళ్ల మార్చి 20 (ఆంధ్రజ్యోతి). డబ్బులు విషయంలో మాటా మాటా పెరిగి మహిళా ఉద్యోగిపై చేయి చేసుకోవడంతో తల బలంగా గోడకు తగిలి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లిలో జరిగింది. పిడుగురాళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణాజిల్లాకు చెందిన సీతారత్నం(57) ఏఎన్‌ఎంగా పనిచేస్తూ పదోన్నతిపై మాచవరం పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా బదిలీపై వచ్చింది. అదే పీహెచ్‌సీలో సత్తెనపల్లికి చెందిన ఎం శ్రీనివాసరావు సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. గత కొంతకాలంగా ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం వుంది. ఈ నేపథ్యంలో బ్రాహ్మణపల్లిలో ఓ అద్దె ఇంట్లో ఉంటున్న సీతారత్నం ఇంటికి శ్రీనివాసరావు వచ్చి వెళుతూ వుండేవాడు. గురువారం రాత్రి డబ్బులు విషయంలోనో, మరో విషయంలోనూ ఇద్దరి మధ్య మాట పెరిగి వాగ్వాదం జరిగింది. ఆ కోపంలో శ్రీనివాసరావు, సీతారత్నాన్ని బలంగా గోడకేసి కొట్టడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. చుట్టుపక్కల వారు ఘటనాస్థలానికి చేరుకుని శ్రీనివాసరావును గదిలో పెట్టి బంధించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ మోహన్ పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 519.00 అడుగులు ఉంది. ఇది 147.45 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7190 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 16,023 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఎత్తిపోతల పథకాలను తక్షణమే పునరుద్ధరించండి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలో ఉన్న ఎత్తిపోతల పథకాలను తక్షణమే పునరుద్ధరించాలని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అసెంబ్లీలో కోరారు. ఆ కాల్వపై 200 లకు పైగా ఎత్తిపోతల పథకాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయకట్టు స్థిరీకరణ, కాల్వల ఆధునికీకరణ అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన సాగు, తాగునీటి సమస్యలపై ప్రభుత్వ వివరణ అడిగారు. గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా రూ.6 వేల కోట్లతో నిర్మించతలపెట్టిన హరిశ్చంద్రాపురం, నకరికల్లు ప్రాజెక్ట్ కి టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్ల ను కూడా ఎంపిక చేసిందని అన్నారు. ఆ ప్రాజెక్ట్ లో గత ప్రభుత్వం రూపాయి పనిచేయలేదని, ఆప్రాజెక్ట్ ను ఎప్పుడు పూర్తిచేస్తారో చెప్పాలని పుల్లారావు సభాముఖంగా ప్రశ్నించారు. హరిశ్చంద్రాపురం-నకరికల్లు ప్రాజెక్ట్ ను బనకచర్లలో విలీనం చేసే ఆలోచన ఉందా అని కూడా ప్రశ్నించారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీ.సందీప్, వై.సుజిత్‌కుమార్

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

తాడికొండ(లాం)మార్చి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవడం వలన ఎన్నో సమస్యలను పరిష్కరించవచ్చునని పీపుల్ సొల్యూషన్స్, కాన్సంట్రిక్స్ క్యాటలిస్ట్ సీనియర్ మేనేజర్ డీ.సందీప్ తెలిపారు. లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న చలపతి మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సందీప్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు చదువుతోపాటు పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఉండే మెళుకువలు నేర్చుకోవడం వలన ఉన్నత స్థాయికి వెళ్తారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించిన టెక్నికల్ ఈవెంట్స్‌లో 16 కళాశాలల నుంచి 67 బృందాలు పాల్గొన్నాయని తెలిపారు. అమరావతి విట్ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి, కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. పేపర్ ప్రెజెంటేషన్‌లో ఒంగోలు క్విస్ కళాశాలకు చెందిన టీ.శిరీష ప్రథమ బహుమతి, ఆర్జేయుకేటికి చెందిన పీ.చైతన్య ద్వితీయ బహుమతి పొందారు. పోస్టర్ ప్రజెంటేషన్‌లో ఆర్జేయుకేటీకి చెందిన పీ.చైతన్య ప్రథమ, క్విస్ కళాశాలకు చెందిన ఎస్.కే. షమీ ద్వితీయ స్థానం పొందారు. ప్రాజెక్ట్ ఎక్స్ షోలో చలపతి కళాశాల విద్యార్థి కే.రూపేష్ ప్రథమ, క్విస్ కాలేజీ విద్యార్థి గోవిందరాజు ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. టెక్నికల్ క్విజ్‌లో చలపతి కళాశాలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు లభించాయి. కోడింగ్ చాలెంజ్‌లో చలపతి కళాశాలకు చెందిన జ్యోతి మణికంఠ, కే. తసీంలు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. లోగో డిజైన్‌లో చలపతి కళాశాల విద్యార్థి ఎల్ అనిత ప్రథమ, విజయవాడ ఎన్నారై కళాశాల విద్యార్థి సాయి యోగేష్ ద్వితీయ బహుమతి సాధించారు. సర్క్యూట్ డి బగ్గింగ్ అండ్ ఫజిల్‌లో విజ్ఞాన లారా కళాశాల విద్యార్థి కే. యామిని, చలపతి కళాశాల విద్యార్థి తిరుమలరావుకు బహుమతులు లభించాయి. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ వై.వీ.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు మీదగా చర్లపల్లి, కన్యాకుమారికి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, కన్యాకుమారికి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07230 చర్లపల్లి - కన్యాకుమారి ప్రత్యేక రైలు ఏప్రిల్ 2వ తేదీ నుంచి జూన్ 25వ తేదీ వరకు ప్రతీ బుధవారం రాత్రి 9.50కి బయలుదేరి నడికుడి, సత్తెనపల్లి మీదగా అర్ధరాత్రి దాటాక 2.30కి గుంటూరు, రేణిగుంట, తిరువణ్ణామలై, చిదంబరం, కుంభకోణం, తంజావూరు, కోడైకెనాల్ రోడ్డు, మధురై మీదగా గురువారం అర్ధరాత్రి దాటాక శుక్రవారం ప్రారంభ సమయం(వేకువజామునకు ముందు) 2.30 గంటలకు కన్యాకుమారి చేరుకొంటుంది. నంబరు. 07229 కన్యాకుమారి - చర్లపల్లి ప్రత్యేక రైలు ఏప్రిల్ 4వ తేదీ నుంచి జూన్ 27వ తేదీ వరకు ప్రతీ శుక్రవారం వేకువజామున 5.15 గంటలకు బయలుదేరి శనివారం వేకువజామున 4.50కి గుంటూరు, 5.44కి సత్తెనపల్లి, ఉదయం 6.04కి నడికుడి, ఉదయం 11.40కి చర్లపల్లి చేరుకొంటుందన్నారు.

డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

గుంటూరు (విద్య) మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో బీసీ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు డీఎస్సీకి ఆన్ లైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎ భవాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు టెట్ పాస్ అయిన అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పదవ తరగతి, బీ ఈడీ లేదా టీసీసీ మార్కుల జాబితా, టెట్ మార్కుల జాబితా, కుల, ఆదాయ, ఆధార్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో రాజా గారి తోటలోని బీసీ స్టడీ సర్కిల్లో సంప్రదించాలని సూచించారు. అభ్యర్థుల తల్లిదండ్రులు ఆదాయం రూ. లక్ష లోపు ఉండాలని సూచించారు. ఇతర వివరాలు కోసం 0863-2358071 లో సంప్రదించాలని సూచించారు.

న్యాయవాదుల క్రికెట్ టోర్నీ విజేత గుంటూరు జట్టు



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ఒకటవ అదనపు జిల్లా జడ్జి సత్యవతి, నాల్గవ అదనపు జిల్లా జడ్జి రుద్రపాటి శరత్‌బాబు

గుంటూరు(లీగల్), మార్చి 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయి న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్‌లో గుంటూరు చంద్రశేఖర్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు గురువారం సాయంత్రం ఒకటవ అదనపు జిల్లా జడ్జి వి ఏ ఎల్ సత్యవతి, నాల్గవ అదనపు జిల్లా జడ్జి రుద్రపాటి శరత్ బాబులు ట్రోఫీలను అందజేశారు. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గుంటూరు న్యాయవాదుల జట్టుతో నరసరావుపేట న్యాయవాదుల జట్టు తలపడింది. తొలుత టాస్ గెలిచిన నరసరావుపేట జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు న్యాయవాదుల జట్టుకు ఓపెనర్లు అంచుల రామాంజనేయులు (47 బంతుల్లో 59 పరుగులు) మహమ్మద్ మాజ్ (27 బంతుల్లో 48 పరుగులు) తమ నిలకడైన బ్యాటింగ్‌తో మంచి ఆరంభాన్ని ఇచ్చారు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన జట్టు కెప్టెన్ చంద్ర శేఖర్ రెడ్డి (26 బంతుల్లో 65 పరుగులు) సాజిద్ (20 బంతుల్లో 30పరుగులు) మెరుపు ఇన్నింగ్స్ తోడవడంతో గుంటూరు న్యాయవాదుల జట్టు 20 ఓవర్లలో మూడు వికెట్లకు 221 పరుగులు చేసింది. నరసరావుపేట జట్టులోని ఖాదర్, కిరణ్, సూర్యలకు ఒక్కో వికెట్ లభించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నరసరావుపేట జట్టు 17.3 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌట్ అయింది. సాజిద్ 3.3 ఓవర్లు బౌలింగ్ చేసి ఐదు వికెట్లు కూల్చాడు. నరసరావుపేట జట్టులో అధికంగా యశ్వంత్ 20 పరుగులు రవి 44 పరుగులు సంజీవ్ 17 పరుగులు మధు 32 పరుగులు చేశారు. బౌలింగ్‌లో ఐదు వికెట్లు తీసి బ్యాటింగ్‌లో 30 పరుగులు సాధించిన గుంటూరు న్యాయవాదుల జట్టు ప్లేయర్ సాజిద్‌కు మ్యాన్ అఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

పరీక్షల కోసం రోగి.. విశ్రాంతిలో ఉద్యోగి



వైద్యపరీక్షలకోసం రేడియాలజీ విభాగం వద్ద ఎదురు చూస్తున్న రోగి



మరమ్మతులకు గురైన సిటీస్కాన్ పరికరంపై నిద్రిస్తున్న ఉద్యోగి

తెనాలి రూరల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాల్లో అత్యవసర విభాగానికి 24 గంటలు వైద్యసేవలకు రోగులు వస్తుంటారు. వారిని వైద్యులు పరీక్షలు చేసి రోగనిర్ధారణకు అవసరమైన స్కానింగ్‌లు, రక్త పరీక్షలు వంటివాటికి పంపుతుంటారు. ఆ రిపోర్టుల ఆధారంగా వైద్యం అందించాల్సి ఉంటుంది. దీంతో రోగుల సహాయకులు వైద్యుల సూచనల మేరకు పరీక్షలు చేయించుకునేందుకు రేడియాలజీ విభాగానికి వస్తుంటారు. అత్యవసర విభాగం నుంచి వచ్చే రోగులకు 24 గంటలు అవసరమైన పరీక్షలు జరిపేలా సిబ్బంది అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. గురువారం వైద్యశాల్లో ఊపిరాడక ఇబ్బందులు పడుతూ వచ్చిన ఓ రోగికి రేడియాలజీ విభాగంలో పరీక్షలు, అనంతరం రక్తపరీక్షలు చేయించుకురావాలని వైద్యులు సూచించారు. ఆయా విభాగాల్లో రేడియాలజీ విభాగానికి పరీక్షలకు వెళితే సిబ్బంది వైద్యసిబ్బంది కనిపించలేదు. అత్యవసర వైద్యం కావడంతో వారి కోసం రోగి బంధువులు పలువురిని వాకబు చేశారు. ఈ క్రమంలో భోజనానికి వెళ్లారని చెప్పడంతో వారి కోసం పడిగాపులు తప్పలేదు. ఇదే క్రమంలో పక్కనే ఉన్న సిటీస్కానర్ గదిలో ఏసీ ఆన్ చేసుకుని ఆ విభాగానికి చెందిన ఓ ఉద్యోగి నిద్రపోవడం చూసి రోగిబంధువులు విస్మయానికి గురయ్యారు.

సాంకేతికతతో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

పెదకాకాని, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆధునిక సాంకేతికతను జోడించి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. వర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల యూజీసీ జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ



సదస్సులో ప్రసంగిస్తున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు.

కార్యక్రమానికి ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న పరిశోధనలు సమాజానికి ప్రయోజనకరంగా మారాలని తెలిపారు. నూతన విద్యా విధానం వల్ల విద్యా రంగంలో సంస్కరణలు రావడంతో పాటు, కొన్ని సవాళ్లు కూడా ఎదురుకోవాల్సి వస్తుందని చెప్పారు. దేశంలోకి ప్రైవేట్ యూనివర్సిటీల రాకతో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో పరిశోధన ఇతర అంశాలను పటిష్ట పరచి విద్యార్థులను ఆకర్షించే విధంగా అడుగులు వేయాలని సూచించారు.

వర్సిటీ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర రోజురోజుకూ పెరుగుతుందన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు, పరిశోధకులు దృష్టి సారిస్తేనే ఉత్తమ ఫలితాలను పొందవచ్చన్నారు. వర్సిటీ రెక్టర్ ఆచార్య కే. రత్నషీలామణి, వర్సిటీ తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, జాతీయ సదస్సు డైరెక్టర్ ఆచార్య చేబ్రోలు లింగరాజు తదితరులు ప్రసంగించారు.



మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న మీ సేవ నిర్వాహకులు

మీ సేవల బలోపేతంపై హర్షం

గుంటూరు(తూర్పు), మార్చి 20(ఆంధ్రజ్యోతి): మీ సేవకు పూర్వ వైభవం తెస్తామని విద్యాశాఖ మంత్రి లోకేశ్ అసెంబ్లీలో ప్రకటన చేయడంపై మీ సేవా నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద తెలుగుతల్లి విగ్రహం వద్ద లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మీ సేవ ఆపరేటర్లు నిర్వాహక సంఘం జిల్లా అధ్యక్షుడు టి వెంకటనర్సు మాట్లాడుతూ సచివాలయాలు, వాట్సప్ సేవలతో పాటు మీ సేవలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తానని లోకేశ్ ప్రకటించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పుల్లంశెట్టి అమరలింగేశ్వరరావు, అవర్ శ్రీనివాస్, మాజేటి విశ్వనాథ్, కొత్త శేషగిరి, గణపతి, నాన్న గోపీనాథ్, వెంకటేశ్వరరావు, ఆలపాటి సుబ్బారావు, పూర్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో ఒప్పందం

చరిత్రాత్మకం: కంచర్ల

గుంటూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఢిల్లీలో బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం చరిత్రాత్మకమని టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గేట్స్ ఫౌండేషన్‌తో ఒప్పందం స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి రాచబాట అవుతుందన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

గుంటూరు(తూర్పు), మార్చి 20(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆవరణలో గురువారం ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. తొలుత శిబిరాన్ని డీఆర్వో షేక్ ఖాజీవలీ ప్రారంభించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ రామలింగారెడ్డి, శ్రావణి, విజయ్ చంద్ర, రామాంజనేయులు, తేజ తదితరులు విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు, కలెక్టరేట్ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సభ్యులు పర్యవేక్షించారు.

ముగిసిన భగవద్గీత ప్రవచనాలు

గుంటూరు(తూర్పు), మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మూడురోజుల పాటు జరిగిన శ్రీమద్భగవద్గీత ప్రవచనాలు గురువారంతో ముగిశాయి. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, జరుబుల బంగారుబాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్మయమిషన్ బ్రహ్మచారి సువీరానంద స్వామి ప్రవచనం చేశారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను

స్పాట్ విధుల నుంచి మినహాయించాలి

గుంటూరు(విద్య), మార్చి 2(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి స్పాట్ వాల్యూయేషన్‌కు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను, 55 సంవత్సరాల పైబడిన వారిని మినహాయించాలని టీఎన్‌యూఎస్ రాష్ట్ర కార్యదర్శి జగదీష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు పి.బాలస్వామి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డీఈఓ రేణుకకు గురువారం వినతిపత్రం అందజేశారు. అలాగే ఏకోపాధ్యాయ పాఠశాలలు, ఇరువురు మాత్రమే సిబ్బంది ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులను స్పాట్ నుంచి మినహాయించాలని కోరారు. వార్షిక పరీక్షలు జరిగే పాఠశాలల టీచర్లను స్పాట్‌వాల్యూయేషన్‌కు వినియోగించరాదని సూచించారు.

అక్రమ ప్రమోషన్లపై విచారణ జరిపించాలి

గుంటూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో అగ్నిమాపక శాఖ లో జరిగిన అక్రమ ప్రమోషన్లపై విచారణ చేపట్టాలని అగ్నిమాపక శాఖ అసోసియేషన్ రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి నడిపినేని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అగ్నిమాపక శాఖ మాజీ డీజీ సునీల్ కుమార్ ప్రోద్బలంతో ఈ అక్రమాలు జరిగినట్లు ఆరోపించారు. సెకండ్ లెవల్ గజిటెడ్ డీ ఎఫ్ఓ పోస్టులు రాష్ట్రంలో 19 మాత్రమే ఉండగా 22మంది ఆ పోస్టుల్లో కొనసాగుతున్నారని అన్నారు. డీజీ సునీల్‌కుమార్ వైసీపీ నేతల సిఫార్సులకు తలొగ్గి అర్హత లేనివారిని రివర్షన్ చేయకుండా మూడో లెవల్ గజిటెడ్ పోస్టుకు బదిలీ చేశారని ఆరోపించారు. హోంమంత్రికి ఇదే విషయమై ఫిర్యాదు చేశామని కోటేశ్వరరావు వెల్లడించారు.

బంగారు ఆభరణాల

సంచి మాయం

గుంటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం బజాజ్ ఎలక్ట్రానిక్స్ వద్ద ఓ మహిళ కారు నుంచి దిగి షాపులోకి వెళ్ళే క్రమంలో ఆమె చేతిలోని బంగారు ఆభరణాలు ఉన్న కర్రలసంచి పడిపోయింది. ఆమె చూసుకోకుండా షాపులోకి వెళ్ళింది. అక్కడ చూసుకోగా ఆభరణాల సంచి కనిపించలేదు. పోలీసుల కథనం మేరకు.. చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామానికి చెందిన నల్ల అఖిల అనే యువతి గురు వారం కుటుంబ సమేతంగా బజాజ్ ఎలక్ట్రానిక్స్‌కు వచ్చింది. అక్కడ అఖిల తల్లి వద్ద ఉన్న బంగారపు వస్తువుల సంచి కారు దిగే క్రమంలో కిందపడి పోయింది. వారు చూసుకోకుండా షాపు లోపలికి వెళ్లి అక్కడ చూసుకొని చుట్టుపక్కల వెతకగా లేకపోవడంతో అక్కడ ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్ పరిశీలించారు. వారు కారు ఆపినచోట ఆభరణాల సంచి కిందపడగా గుర్తుతెలియని వ్యక్తి ఆటోలో వచ్చి ఆ సంచి తీసుకొని వెళ్ళాడు. ఆ సంచిలో 50 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా ఆటోను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు రాకుండా డ్రెయిన్‌లకు మెష్‌లు పెట్టాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



డ్రెయినేజీలో పూడికి తీతను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అంతర్గత డ్రెయిన్ల నుండి ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు మేజర్ డ్రెయిన్లలోకి రాకుండా మెష్‌లు ఏర్పాటుచేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ సంగడిగుంట, ఎల్ఆర్ కాలనీ, ఆనందపేట, అరండల్ పేట తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్లు, డ్రెయిన్ల మీద ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. తొలుత 9వ డివిజన్ మస్టర్ పాయింట్‌ని పరిశీలించి, కార్మికుల, కార్యదర్శుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. పారిశుధ్య పనులు పిన్‌పాయింట్ మేర కు నూరుశాతం జరగాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఏఈ రవికిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇద్దరు అవుట్‌సోర్సింగ్ ఆపరేటర్ల తొలగింపు

తాగునీటి సరఫరా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వసంతరాయపురం రిజర్వాయర్‌లోని ఇద్దరు ఔట్‌సోర్సింగ్ వాల్వ్ ఆపరేటర్లను విధుల నుండి తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వసంతరాయపురం రిజర్వాయర్ లో శ్యామ్‌ప్రసాద్, నారాయణలు తమకు కేటాయించిన తాగునీటి సరఫరా వాల్వ్ ఆపరేటింగ్ విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్నారని స్థానిక ప్రజల ఫిర్యాదుల మేరకు విధుల నుండి తొలగించామన్నారు.

పర్యావరణహితంగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు భాగస్వాములు కావాలి

పర్యావరణహిత, కాలుష్య రహిత నగరంగా గుంటూరు నగరాన్ని తీర్చిదిద్దుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిషనర్ కోరారు. అందులో భాగంగా టెర్రస్, కిచెన్ గార్డెన్స్ నిర్వాహకులు, ప్రకృతి ప్రేమికులతో ఈ నెల 22న ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని, సమావేశంలో సూచనలు, సలహాలు అందించాలని కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో కోరారు. ఏప్రిల్ 1 నుండి గుంటూరులో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేధం అమలు చేయనున్నామని, అందులో భాగంగా వివిధ వ్యాపార, వాణిజ్యసంస్థల ప్రతినిధులకు అవగాహన సదస్సుని ఈ నెల 25న జీఎంసిలో ఏర్పాటుచేశామని తెలిపారు. సదస్సుకి చాంబర్ ఆఫ్ కామర్స్, హోల్ సేల్, రిటైల్ వ్యాపార సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నగరాభివృద్ధిపై డ్రోన్ నిఘా

నగర పాలక సంస్థ అభివృద్ధికి ప్రత్యేక పర్యవేక్షణకు డ్రోన్ విధానాన్ని శుక్రవారం నుండి అమలుచేస్తామని కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో డ్రోన్‌లను స్వయంగా ఆపరేట్ చేసి పలు ప్రాంతాలలోని పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పనులను, అనధికార కట్టడాలను, తాగునీటి సరఫరా పైపులైన్ల లీకులను, పార్కులు, డివైడర్లు, జంక్షన్లు, వీధి దీపాలు, నగర పాలక సంస్థ నిర్మిస్తున్న రోడ్లు, వాహనాల క్షేత్రస్థాయి తనిఖీకి ఈ డ్రోన్ల విధానం శులభతరం అవుతుందన్నారు.

ఉగాది నుంచి గుంటూరులో ఫుడ్ కోర్టు

ఎమ్మెల్యే గళ్లా మాధవి



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, భాష్యం ప్రవీణ్

గుంటూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఉగాది నుంచి ఫుడ్ కోర్టు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. నియోజకవర్గంలోని 42వ డివిజన్లో రూ.98.90లక్షల అంచనాలతో సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, భాష్యం ప్రవీణ్, కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్‌లు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చాక 42వ డివిజన్లో రూ.50లక్షలతో డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఇప్పుడు రూ.98.90 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామన్నారు. మార్చి ఒకటి నుంచి ప్లాస్టిక్‌పై నిషేధం అమలులోకి రానుందన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల గురించి మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవి నాయకత్వంలో గుంటూరు పశ్చిమ అభివృద్ధిలో వేగంగా అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో కనపర్తి శ్రీనివాసరావు, కసుకుర్తి హనుమంతరావు, లంకా ఉదయ్, గార్డెన్స్ శ్రీకాంత్, రాధాకృష్ణ, కిరణ్‌కుమార్‌రెడ్డి, పున్నారావు, సతీష్‌కుమార్, పద్మలత, జనసేన ప్రభు, విజయలక్ష్మి, గుర్రం ప్రసాద్, మొవ్వ వేణు తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో క్లిష్టమైన గుండె వైద్యచికిత్సలు

● ఆధునిక పద్ధతుల్లో రక్తనాళాల్లో పూడికల తొలగింపు



కార్డియాలజిస్టులు డాక్టర్ అజ్భర్ జమాన్, డాక్టర్ హరిత తదితరులు

గుంటూరు మెడికల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మంగళదాస్‌నగర్‌లోని కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో గురువారం ఒక్కరోజే మూడు క్లిష్టమైన గుండె వైద్య చికిత్సలు నిర్వహించారు. ఈ ముగ్గురు హృద్రోగుల గుండె రక్తనాళాల్లో క్యాల్షియం పేరుకు పోయి నాళాలు బాగా గట్టిపడ్డాయి. దీనివల్ల రోగుల గుండెకు సరిపడినంత రక్తసరఫరా జరగడం లేదు. ఇంగ్లాండ్ నుంచి వచ్చిన ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అజ్భర్ జమాన్ నేతృత్వంలో కిమ్స్ శిఖర కార్డియాక్ సైన్సెస్ డైరెక్టర్, కార్డియాలజిస్ట్ డాక్టర్ పీవీఎస్ హరిత, క్యాత్‌ల్యాబ్ డైరెక్టర్ డాక్టర్ శివప్రసాద్ విజయవంతంగా ఈ ముగ్గురు రోగులకు గుండెచికిత్సలు నిర్వహించారు. ఇంట్రా కరోనరీ అల్ట్రాసౌండ్, కటింగ్ బెలూన్, మైక్రో కెథెటర్, డ్రగ్ ఎల్యుటేడ్ బెలూన్‌యాంజియోప్లాస్టీ వంటి సరికొత్త పద్ధతుల్లో రక్తనాళాల్లో పూడికలు తొలగించి శస్త్రచికిత్స అవసరం లేకుండా, స్టెంట్ వేయడం ద్వారా రోగులకు ప్రాణదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిత మాట్లాడుతూ గతంలో ఇలాంటి రోగులకు శస్త్రచికిత్సలు చేయాల్సి వచ్చేదన్నారు. నూతన సాంకేతిక పద్ధతులతో శస్త్రచికిత్స అవసరం లేకుండా యాంజియోప్లాస్టీ ద్వారా రోగులకు మెరుగైన వైద్యం అందించినట్లు తెలిపారు. దీని వల్ల రోగులు త్వరగా కోలుకుంటారన్నారు. కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో ఎటువంటి క్లిష్టమైన గుండె జబ్బులకైనా ప్రపంచస్థాయి వైద్యసేవలు అందుబాట్లో ఉన్నట్లు డాక్టర్ హరిత తెలిపారు.



గుంటూరు తూర్పు తహసీల్దార్ సుభానిని కలిసి సమస్యలు నివేదించిన రేషన్ డీలర్ల సంఘం నగర నాయకులు

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

● తూర్పు తహసీల్దార్‌కు అసోసియేషన్ నేతల విజ్ఞప్తి

గుంటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు మండలంలో రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నగర రేషన్ డీలర్ల సంఘం నాయకులు నూతన తహసీల్దార్ షేక్ సుభానికి విజ్ఞప్తి చేశారు. గురువారం అసోసియేషన్ నగర అధ్యక్షుడు తుమ్మల గాంధీ ఆధ్వర్యంలో డీలర్లు తహసీల్దార్‌ని కలిశారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ తమకు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి సరైన తూకం వేసి సరుకులు సరఫరా జరిగేలా చూడాలన్నారు. అలానే ఎండీయూలు నిత్యం క్లోజింగ్ బ్యాలెన్స్ అందజేసేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం నాయకులు షేక్ జిలాని, షేక్ మొహమ్మద్ జునైద్, షేక్ ఆరిఫ్, అబ్దుల్ రెహమాన్, సాయి హన్మంతరావు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాదు

గుంటూరు(తూర్పు), మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టి, చట్టం చేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నందుకు లాడ్జి సెంటర్‌లో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వరప్రసాదు మాట్లాడుతూ శాసనసభ తీర్మానాన్ని జాతీయ ఎస్సీ కమిషన్‌కు నివేదించేందుకు సీనియర్ ఐఎఎస్ అధికారిని నియమించాలని కోరారు. తొలుత లాడ్జీసెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో చావలి బాలస్వామి, అత్తోట జోసఫ్‌కుమార్, కాకుమాను పున్నారావు, టొబాకో అప్పారావు, పరంగి సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

హ్యాకింగ్ సినిమా షూటింగ్ సందడి



సినిమా సన్నివేశాలను చిత్రీకరిస్తున్న దర్శకుడు నరేష్ మణి

గుంటూరు(తూర్పు), మార్చి 20(ఆంధ్రజ్యోతి): నగరంలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. హ్యాకింగ్ అనే సినిమాకు సంబంధించిన సన్నివేశాలను చిత్ర దర్శకులు గుంటూరు, పరిసర ప్రాంతాల్లో గురువారం చిత్రీకరించారు. చిత్ర దర్శకులు నరేష్ దోనే, మణివరన్ మాట్లాడుతూ సైబర్ నేరాల నియంత్రణకై ఈ సినిమాను రూపొందిస్తున్నామని అన్నారు. కొన్ని సన్నివేశాలను ఇప్పటికే కొండవీడులో చిత్రీకరించామని వివరించారు. హీరోయిన్‌గా కావ్యదేశాయ్ నటిస్తున్నట్లు తెలిపారు.

లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన

యువకుడికి రూ.7వేల జరిమానా

గుంటూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వాహనానికి సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన యువకుడికి రవాణా శాఖ అధికారులు రూ.ఏడు వేలు జరిమానా విధించారు. ఈ మేరకు గురువారం నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కంకరగుంట ఫ్లైఓవర్ అండర్ పాస్ వద్ద వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య ఆధ్వర్యంలో ఎస్సై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేకుండా వాహనం నడిపిన యువకుడికి రూ.ఏడు వేలు జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.ఐదు వేలు జరిమానా విధించడం జరుడుతుందని ఎస్సై సాంబశివరావు నాయక్ తెలిపారు.

ఈస్ట్ సబ్ డివిజన్‌లో నాకా బందీ

గుంటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నగరంలోని ఈస్ట్ సబ్ డివిజన్‌లో గురువారం సాయంత్రం 4.30 గంటల నుంచి నాకా బందీ నిర్వహించారు. అదనపు ఎస్పీ కె.సుప్రజ ఆధ్వర్యంలో లాలాపేట స్టేషన్ పరిధిలోని కమ్యూనిస్టుబొమ్మల సెంటర్, హిమని సెంటర్, ఎత్తు రోడ్డు సెంటర్, కొత్తపేట స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్ రైల్వేగేటు, పాతగుంటూరు పరిధిలోని పొన్నూరు రోడ్డు, సుద్దపల్లి డొంక తదితర ప్రాంతాల్లో ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం సుమారు 300 కేసులు నమోదు చేసి వారి నుంచి అపరాధ రుసుం సుమారు 4 లక్షల వరకు వసూలు చేశారు. ఈ తనిఖీల్లో ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, వెస్ట్ డీఎస్పీ అరవింద్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

నేటి నుంచి విజ్ఞాన్ నిరులోత్సవ్ 2కే25

గుంటూరు(విద్య), మార్చి 20(ఆంధ్రజ్యోతి): పలకలూరులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నుంచి రెండురోజుల పాటు జాతీయస్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక గురువారం తెలిపారు. మొత్తం 45 అంశాల్లో పోటీలు జరుగుతాయని వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ముఖ్య అతిథిగా విజ్ఞాన్ నిరులోత్సవ్ 2కే25 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ రాధిక మాట్లాడుతూ మొదటి రోజు జరిగే ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎస్‌సీహెచ్‌ఈ (ఆంధ్రప్రదేశ్‌స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్) చైర్మన్ ప్రొఫెసర్ కే మధుమూర్తి హాజరవుతారన్నారు. శనివారం జరిగే ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పాల్గొంటారన్నారు. దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్, ఎంబీఏ విద్యార్థులతోపాటు డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు కూడా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

ఎంఈవో-2 సమస్యల పరిష్కరించాలి

● విద్యాశాఖ కార్యదర్శి విజయరామరాజుకు రాష్ట్ర నాయకుల వినతి



రవీంద్రనాథ్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎంఈఓ 2 అసోసియేషన్ నాయకులు సుబ్బారావు తదితరులు

గుంటూరు (విద్య), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ద్వితీయ మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓ-2) ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సంఘం అధ్యక్ష కార్యదర్శులు టీవీ రామకృష్ణ, రాయల సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం పాఠశాల విద్యా కార్యదర్శి విజయరామరాజుకు, డైరక్టర్ రవీంద్రనాథ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఎంఈఓ 2లకు ఇంతవరకు ఎటువంటి జాబ్‌చార్ట్ లేదని, విద్యార్థులకు పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాల రవాణా చార్జీలు చెల్లించలేదని పేర్కొన్నారు. జీవో నెంబర్ 89 ప్రకారం విధులు కేటాయించాలని కోరారు. ఐదు మండలాలకు ఒక ఎంఈఓ1 నియమిస్తున్నారని, దీనివల్ల ఎంఈఓ-2లకు పనిభారం పెరిగిపోతుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆలిమ్, శంకరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉషోదయ సూపర్ మార్కెట్ ప్రారంభం



జ్యోతి వెలిగిస్తున్న డాక్టర్ కాసరనేని రమాబాల

గుంటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డులో ఉషోదయ సూపర్ మార్కెట్ బుధవారం ప్రారంభమైంది. ఏపీ క్రెడాయ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, డాక్టర్ కాసరనేని రమాబాల, పయినీర్ గ్రూప్ చైర్మన్ చుక్కపల్లి రమేష్ జ్యోతి వెలిగించి ఉషోదయ సూపర్ మార్కెట్‌లో వస్తువుల కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపర్ మార్కెట్ చైర్మన్ మన్నవ యుగంధర్ మాట్లాడుతూ గుంటూరులో సూపర్ మార్కెట్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో గుడివాడ, ఒంగోలుల్లో తమ సంస్థలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. గుంటూరుతో కలిపి తెలుగు రాష్ట్రాల్లో 30 శాఖలున్నాయన్నారు. ప్రారంభోత్సవ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్లు తెలిపారు. రూ.1,299 కొనుగోళ్లపై స్క్రాచ్ కార్డు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాఘవేంద్రరావు, స్వరాజ్యరావు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

కారు విక్రయిస్తానని

రూ.4లక్షలు తీసుకుని మోసం

గుంటూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బొంగరాలబీడు 4వ లైనుకి చెందిన గుడిపూడి అనిల్‌బాబు అనే అతనికి కొద్ది రోజుల క్రితం యాద భార్గవకృష్ణ పరిచయం అయ్యాడు. సదరు భార్గవ కృష్ణ అన్నయ్యకి ఆరోగ్యం బాగాలేక హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ కారణంగా డబ్బులు అవసరమై అతని కారుని రూ.4 లక్షలకు అమ్ముతానని అనిల్‌బాబుని నమ్మించాడు. అతని వద్ద నుండి 4 లక్షల నగదు తీసుకొని, కారు అతని పేరు మీద రిజిస్ట్రేషన్ చేయకుండా 12న కారును తీసుకొని వెళ్ళి ఆర్‌టీఓ ఆఫీసు వద్దకి రమ్మని రిజిస్ట్రేషన్ చేయిస్తానని చెప్పాడు. కారు తీసుకొని వెళ్ళి ఇంతవరకు తిరిగి రాలేదని, కారు కానీ, నగదు కానీ తిరిగి ఇవ్వకుండా మోసం చేసినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్మానం రాజ్యాంగ వ్యతిరేకం

● మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్

● వర్గీకరణను వ్యతిరేకిస్తూ గుంటూరులో నిరసన



అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలియజేస్తున్న మాలమహానాడు నాయకులు

గుంటూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయటం రాజ్యాంగ వ్యతిరేకమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ ధ్వజమెత్తారు. మాలమహానాడు ఆధ్వర్యంలో గుంటూరు లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట బైఠాయించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభలో రెండు కులాలను విడగొడుతూ బిల్లు పెట్టడం రాజ్యాంగాన్ని అవహేళన చేయటమేనన్నారు. మాలలను అణచివేసే ధోరణిలో ప్రభుత్వం ఉన్నట్లుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఖచ్చితంగా న్యాయపోరాటానికి సిద్ధమవుతామన్నారు. రానున్న రోజుల్లో రాజధానిలో లక్షలాది మందితో సభ ఏర్పాటుచేసి మాలల సత్తా చూపిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్‌పాల్, జిల్లా అధ్యక్షుడు ధారా హేమ ప్రసాద్, రాష్ట్ర మహిళా కార్యదర్శి పిల్లి మేరీ, పార్లమెంట్ అధ్యక్షుడు తురక వెంకటేశ్వరరావు, వనపర్తి ఏసుబాబు, బండ్లమూడి స్టాలిన్ బాబు, నల్లపు నీలాంబరం, బోరుగడ్డ రజినీకాంత్, పిడతల నారాయణ, ఏచూరి వేణు, మచ్చు భరత్, నందూరి రవితేజ, సముద్రాల కోటేశ్వరావు, రాచకొండ ముత్యాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరిహారం ఇప్పించండి

● కలెక్టర్‌కు విజ్ఞాపన



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

గుంటూరు(తూర్పు), మార్చి 20(ఆంధ్రజ్యోతి): గత నెల 18న బుడంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబాలకు పరిహారం ఇప్పించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ నాగలక్ష్మీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఈశ్వరరావు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు రూ 10లక్షలు, కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం, గాయపడిన వారికి రూ.2లక్షలు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గుర్రంకొండ సత్యానందం, దేవుని దయ, షేక్ గౌస్ తదితరులు ఉన్నారు.

ఏమంటివి.. ఏమంటివి

ఏకపాత్రాభినయంలో అబ్బురపరిచిన రఘురామ

దుర్యోధనుడి అభినయంతో ప్రథమ బహుమతి

చీఫ్ విప్ జీవీ జట్టు స్కిట్ 'ఇదీ సంగతి'కి ప్రథమ స్థానం

ముగిసిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల క్రీడా, సాంస్కృతిక పోటీలు



దుర్యోధనుడి వేషంలో రఘురామకృష్ణరాజు

విజయవాడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య దేవా.. ఏమంటివి.. ఏమంటివి.. అంటూ దానవీరశూరకర్ణ చిత్రంలో దుర్యోధనుడు పాత్రధారి చెప్పిన డైలాగుతో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రదర్శించిన ఏకపాత్రాభినయం అబ్బురపరిచింది. రెండు రోజులుగా విజయవాడలో జరుగుతున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల క్రీడా, సాంస్కృతిక పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విజయవాడ ఏ-కన్వెన్షన్‌లో తొలుత సాంస్కృతిక పోటీలు నిర్వహించి అనంతరం విజేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు బహుమతులు అందజేశారు. ఏకపాత్రాభినయంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రథమ బహుమతి అందుకున్నారు. పల్నాటి బాలచంద్రుడి వేషం ధరించిన మంత్రి కందుల దుర్గేశ్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. స్కిట్లలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు బృందం ప్రదర్శించిన 'ఇదీ సంగతి' ప్రథమ బహుమతిని, ఈశ్వరరావు, విజయ్‌కుమార్ ప్రదర్శించిన 'అసందర్భపు పాట' ద్వితీయ బహుమతి గెలుచుకున్నాయి.

బ్యాడ్మింటన్: పురుషుల సింగిల్స్ విభాగంలో మంత్రి టీజీ భరత్ ప్రథమ బహుమతి, జయనాగేశ్వరరెడ్డికి ద్వితీ యం. డబుల్స్ విన్నర్లుగా మంత్రి సత్యకుమార్- జయనాగేశ్వరెడ్డి. భరత్-పీవీ పార్థసారథి రన్నర్స్‌గా మహిళల సింగిల్స్ విజేత పి.సింధూరరెడ్డి. భూమా అఖిల ప్రియకి ద్వితీయం, డబుల్స్ విన్నర్లుగా అఖిలప్రియ-సిం ధూరరెడ్డి, రన్నర్లుగా మంత్రి సవిత-శ్రావణిశ్రీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో మంత్రులు టీజీ భరత్-సవితకు ప్రథమం. అఖిలప్రియ, జయనాగేశ్వరెడ్డికి ద్వితీయం. బ్యాడ్మింటన్ 60 ఏళ్ల పైబడిన విభాగంలో అరవింద్‌బాబు విన్నర్.. శివరామిరెడ్డి రన్నర్. 55 ఏళ్ల పైబడిన విభాగంలో గద్దె రామ్మోహన్ ఫస్ట్. రవీంద్రబాబు ద్వితీయం.

పరుగుపందెం: 100 మీటర్ల పరుగు పందెం 50 ఏళ్లలోపు విభాగంలో అరవ శ్రీధర్ ప్రథమ, విజయచందర్ ద్వితీయ, కాకర్ల సురేశ్ తృతీయ బహుమతి. 60 ఏళ్లలోపు విభాగంలో కేశ శ్యామ్‌కుమార్, సత్యకుమార్, పీవీ పార్థసారథికు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు. 60 ఏళ్ల పైబడిన విభాగంలో బి.రామాంజనేయులికి ప్రథమం, గద్దె రామ్మోహన్ ద్వితీయం. గోరంట్ల బుచ్చయ్యచౌదరికి తృతీయం.

100 కిలోల లోపు బరువు: కె.శ్రీకాంత్, విజయ్‌కుమార్, బొజ్జల సుధీర్‌రెడ్డికి మొదటి మూడు బహుమతులు. మహిళల విభాగంలో ప్రథమ బహుమతిని పి.సింధూరరెడ్డి, ద్వితీయ బహుమతిని రెడ్డప్పగారి మాధవి, తృతీయ బహుమతిని వంగలపూడి అనిత గెలుచుకున్నారు.

షాట్‌పుట్: పురుషుల 60 ఏళ్లలోపు విభాగంలో బి.విజయచందర్, ఆదిరెడ్డి శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ మొదటి, రెండు, మూడో స్థానాలు. 60 ఏళ్ల పైబడిన విభాగంలో కామినేని శ్రీనివాస్, గద్దె రామ్మోహన్, ఎంఎం కొండయ్యయాదవ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు.

మ్యూజికల్ చైర్స్: మొదటి స్థానాన్ని మిరియాల శిరీషాదేవి, ద్వితీయ స్థానాన్ని సవిత, మూడో స్థానాన్ని పి.సింధూరరెడ్డి గెలుచుకున్నారు.

టెన్నిస్: పురుషులు సింగిల్స్‌లో నాదెండ్ల మనోహర్ విన్నర్, పీవీ పార్థసారధి రన్నర్

టేబుల్ టెన్నిస్: పురుషుల విభాగంలో వర్ల కుమార్‌రాజా విన్నర్, కేశ శ్యామ్‌కుమార్ రన్నర్.

క్యారమ్స్: పురుషులు విభాగంలో గద్దె రామ్మోహన్ ఫస్ట్. వంకా రవీంద్రనాథ్‌కు ద్వితీయం. మహిళల విభాగంలో కర్రి పద్మశ్రీ ప్రథమ, గౌరు చరితారెడ్డి ద్వితీయ, రెడ్డప్పగారి మాధవికి తృతీయ బహుమతి. డబుల్స్ విభాగంలో నెలవల విజయశ్రీ, మిరియాల శిరీషాదేవి విజేతలు. తంగిరాల సౌమ్య, జగదీశ్వరి రన్నర్స్.

కబడ్డీ: సీఎం జట్టు విన్నర్స్, స్పీకర్ జట్టు రన్నర్స్. మూడోస్థానంలో బుచ్చయ్యచౌదరి టీం.

వాలీబాల్: అయ్యన్నపాత్రుడు టీం విజేత.. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి జట్టు రన్నర్స్.

టగ్గాఫ్ వార్: మంత్రి గుమ్మిడి సంధ్యారాణి జట్టు విజయ కేతనం. పురుషుల విభాగంలో బుచ్చయ్యచౌదరి జట్టు ప్రథమ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు జట్టు ద్వితీయ బహుమతి.

త్రోబాల్: అఖిలప్రియ జట్టుకు మొదటి స్థానం. మంత్రి అనిత జట్టుకు ద్వితీయం.

టెన్నికాయిట్: పురుషుల సింగిల్స్‌లో సత్యకుమార్, గద్దె రామ్మోహన్, వంకా రవీంద్రనాథ్‌కు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు. మహిళల డబుల్స్‌లో కర్రి పద్మశ్రీ-అఖిలప్రియ విన్నర్స్. కోళ్ల లలితకుమారి-సింధూరరెడ్డి రన్నర్స్.

క్రికెట్: విజేత మంత్రి నాదెండ్ల మనోహర్ జట్టు. రన్నర్స్‌గా మంత్రి సత్యకుమార్ జట్టు.



క్రికెట్లో మొదటి బహుమతి సాధించిన జట్టు కెప్టెన్ మంత్రి మనోహర్‌కు బహుమతి అందజేస్తున్న చంద్రబాబు, పవన్



పరుగు పందెంలో ప్రథమ బహుమతి అందుకుంటున్న ఎమ్మెల్యే రామాంజనేయులు



బ్యాడ్మింటన్‌లో విన్నర్‌గా నిలిచి బహుమతి అందుకుంటున్న ఎమ్మెల్యే అరవిందబాబు



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తదితరులు



ఇదీ సంగతి స్కిట్‌లో జీవీ ఆంజనేయులుతో కలిసి ప్రదర్శన ఇస్తున్న ఎమ్మెల్యేలు బ్రహ్మారెడ్డి, అరవిందబాబు

ఒకటికి మించి..

యార్డులో కొన్ని కుటుంబాలకు ఒకటి కంటే ఎక్కువ లైసెన్సులు

ఇప్పటికే 134 గుర్తించాం... మరో 27 కూడా జాబితాలో ఉన్నాయి

మార్కెటింగ్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ విజయ సునీత



మిర్చియార్డులో అధికారులు, సిబ్బందితో సమావేశమైన మార్కెటింగ్ రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ ఎం విజయ సునీత

గుంటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో ఒకే కుటుంబంలో ఒకటి ఎక్కువమందికి లైసెన్సులు ఉన్నవి గుర్తించామని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ ఎం విజయసునీత చెప్పారు. ఇలా ఇప్పటికే 134 లైసెన్సులను పట్టుకున్నాం. మరో 27 కూడా ఇలాంటివే ఉన్నాయి. వీటన్నింటిపై ఒక సమగ్ర నివేదికని రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. మిర్చియార్డులో జరుగుతున్న అక్రమాలు, అవినీతిపై ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, రామాంజనేయులు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్ బుధవారం అసెంబ్లీలో ప్రస్తావించడంతో మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత గురువారం మిర్చియార్డు పరిపాలన భవనానికి వచ్చి సెక్రటరీలు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందితో సుదీర్ఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గత నెల 22వ తేదీన సీఎం చంద్రబాబునాయుడు మిర్చియార్డుపై 4 గంటల పాటు సమీక్ష నిర్వహించారని, ఆ సమావేశంలో సీఎం జారీ చేసిన ఆదేశాలను ఏమేరకు అమలు చేస్తున్నారనేది సమీక్షించేందుకు తాను రావడం జరిగిందన్నారు.

రైతుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్య ధోరణి పనికి రాదు. ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యంగా ఉన్నా కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. యార్డులో కొంతమంది వ్యాపారస్థులు ఎలాంటి లైసెన్సులు లేకుండానే మిర్చి వ్యాపారం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అలానే కొందరు లైసెన్సులు ఉండి ఎలాంటి వ్యాపారలు చేయడం లేదన్నారు. గత మూడు నెలల్లో మిర్చి లావాదేవీలకు సంబంధించి రిపోర్టుని ఇవ్వమని కమీషన్ ఏజంట్లను ఆదేశించాం. ఎవరైతే ఇవ్వరో వారిపై చర్యలు తీసుకొంటామన్నారు. అలానే ఇంకా జీరో, కటింగ్, బిల్-టూ-బిల్ వ్యాపారాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. మచ్చుకాయలను తీసుకోవడం కూడా నిరోధించడం లేదు. వీటన్నింటిపై కఠిన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. మిర్చియార్డులో వ్యాపారం చేయాలంటే నిబంధనల మేరకు లైసెన్సు పొంది ఉండాల్సిందేనన్నారు.

కర్ణాటక నుంచి ఎక్కువ మోతాదులో మిర్చి టిక్కీలను ఇక్కడి కమీషన్ వ్యాపారస్థులు తెప్పిస్తున్నారు. దీని వలన స్థానిక రైతుల మిర్చి నాణ్యతగా ఉన్నా ధర పెరగడం లేదు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకొంటామన్నారు. ప్రస్తుతం మూడో పంట కోతల మిర్చి వస్తున్నది. వాటిల్లో నాణ్యత ఉండటం లేదు. అలానే తాలు, తేమశాతం ఎక్కువ మోతాదులో ఉంటుండటం వలన కూడా ధర పెరగడం లేదన్నారు. ఈ విషయంలో రైతులు సహకరించి బాగా ఎండబెట్టి మిర్చిని గ్రేడింగ్ చేసుకొని యార్డుకు తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్లు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, ఏడీ రాజబాబు, సెలెక్షన్‌గ్రేడ్ సెక్రెటరీ ఏ చంద్రిక, వివిధ గ్రేడ్‌ల కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, ఆంజనేయ సింగ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



జడ్పీకి.. బకాయిల భారం

రావాల్సిన అద్దెలు రూ.1.22 కోట్లు.. అతిథిగృహాల్లో పేరుకుపోయిన బాకీలు

గుంటూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అసలే నిధుల లేమితో అల్లాడిపోతున్న ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు అద్దె బకాయిలు మరింత తలనొప్పిగా మారాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఇంకా రూ.1.22 కోట్ల వరకు అద్దె బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా పరిషత్ అతిథి గృహాల్లో కూడా అద్దె బకాయిలు పేరుకు పోవటం పట్ల జడ్పీ ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా అద్దె బాకీలు పూర్తిస్థాయిలో వసూలు కాకపోవడంతో జడ్పీ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశారు.

జిల్లా పరిషత్‌కు చెందిన పంచాయతీ రాజ్ అతిథి గృహాలు ఉమ్మడి జిల్లాలో ఆరు ఉన్నాయి. వాటి బకాయిలు రూ. 40.94 లక్షల వరకు రావాల్సి ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జిల్లా పరిషత్‌కు 10 షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. వాటి బకాయిలు రూ. 66.85 లక్షల వరకు బాకీలు పేరుకుపోయాయి.

9 పెర్రీలకు రూ. 16.50 లక్షల బాకీలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి వసూళ్ల కోసం వెళ్ళటం జరుగుతుంది. పదే పదే హెచ్చరించినా అద్దెలు చెల్లించకపోతే తీవ్రమైన చర్యలు ఉంటాయి అని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ అన్నారు.

సర్వేలతో.. సతమతం

ఒక్కొక్కరికి నాలుగు క్లస్టర్లతో ఇబ్బందే అంటున్న సచివాలయ ఉద్యోగులు



గుంటూరు సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వాటర్ టాప్ కనెక్షన్ సర్వే.. హౌస్ హోల్డ్ సర్వే.. ప్రతి ఇంటి జియో టాగింగ్ సర్వే... ఎంఎస్ఎంఈ సర్వే.. చిల్డ్రన్ విత్‌ఔట్ ఆధార్ సర్వే... పీ4సర్వే.. వర్క్ ఫ్రం హోం సర్వే... ఇలా చదువుతూ పోతే బోలెడు సర్వేలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. ఒకదాని తర్వాత ఒకటి వరుసగా వస్తుండటంతో సచివాలయం ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. అన్ని సర్వేలకు నియమిత కాల వ్యవధి నిర్ణయించడం కూడా ఉద్యోగులను ఒత్తిడికి గురిచేస్తున్నది. అన్ని శాఖల సర్వేలు కలగాపులగంగా ఉండటం కూడా తీవ్ర గందరగోళానికి గురిచేస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 13,424 మంది ఉద్యోగులు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. చివరకు సెలవు రోజుల్లో కూడా సర్వేలు చెయ్యాల్సి రావటం ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తుంది.

ఒక్కరికీ నాలుగు క్లస్టర్లు...

సర్వేల కోసం గ్రామాన్ని క్లస్టర్లుగా విభజించారు. ఒక్కో ఉద్యోగికి నాలుగు క్లస్టర్లు తగ్గకుండా వస్తున్నట్లు తెలుస్తుంది. నాలుగు క్లస్టర్లకు సుమారు 250 నుంచి 300 వరకు గృహాలు ఉంటున్నాయి. ఆ గృహాలకు సంబంధించిన పూర్తి బాధ్యత సర్వే చేస్తున్న ఉద్యోగిపై పడుతుందని చెబుతున్నారు. గుంటూరు జిల్లాలో వార్డు సచివాలయాలు 336, గ్రామ సచివాలయాలు 232, పల్నాడు జిల్లాలో వార్డు సచివాలయాలు 141, గ్రామ సచివాలయాలు 397, బాపట్ల జిల్లాలో వార్డు సచివాలయాలు 69, గ్రామ సచివాలయాలు 408 ఉన్నాయి. వార్డు, గ్రామ సచివాలయాలలో సర్వే వ్యవహారంలో ఒకే సమస్యను ఎదుర్కొంటున్నట్లు ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. దివ్యాంగులపై కూడా అదే పనిభారం పడుతుంది. సర్వేల విషయంలో పనిని పంచుకునేందుకు తోటి ఉద్యోగులు ఇష్టపడక పోవడంతో నడవలేని స్థితిలో కూడా కొందరు దివ్యాంగులు ఇంటింటికి తిరగాల్సి వస్తుందని చెబుతున్నారు.

ఆయా సర్వేలు చేసేందుకు గత ప్రభుత్వం వలంటీర్లకు ఫోన్ లు అందజేసింది. వాళ్ళు రాజీనామా చేసిన తర్వాత తిరిగి వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం ఆ ఫోన్లు మూలన పడేశారు .దాంతో సచివాలయ ఉద్యోగులు సొంత ఫోన్లతోనే సర్వేలు చేస్తున్నట్లు చెబుతున్నారు. మొబైల్ నెట్ బ్యాలెన్స్ కూడా సొంత నిధులతోనే వేస్తున్నట్లు చెబుతున్నారు.

ఆయా విషయాలపై స్పందిస్తూ సర్వేల పేరిట సచివాలయ ఉద్యోగులను తీవ్ర పని ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మధు అన్నారు.

పరాశక్తికి అదనపు గనుల రద్దు

◆ అదనంగా ఉన్న 13.899 హెక్టార్ల తొలగింపు ◆ గోలి రిజర్వు ఫారెస్టు హద్దు వద్ద ఉండటమే కారణం ◆ 317.782 హెక్టార్లలో మాత్రమే మైనింగ్‌కి అనుమతి ◆ ఎర్రాట జారీ చేసిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ

గుంటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పరాశక్తి సిమెంట్స్‌కి రెంటచింతల మండలంలోని జెట్టిపాలెం(గోలి) గ్రామంలో కేటాయించిన సున్నపురాయి గనుల్లో అధికంగా ఉన్న 13.899 హెక్టార్లను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ తొలగించింది. ఈ భూములు గోలి రిజర్వు అటవీ భూమికి సమీపంలో ఉన్నందున ప్రభుత్వం రద్దు నిర్ణయం తీసుకున్నది. దీంతో ఆ సంస్థకు కేటాయించిన 317.782 హెక్టార్లలో మాత్రమే సున్నపురాయి మైనింగ్ చేసుకోవడానికి అనుమతి ఉంటుంది. ఈ మేరకు ఎర్రాటని ప్రభుత్వం జారీ చేసింది. పరాశక్తి సిమెంట్స్‌కి 2011 జూన్‌లో సర్వే నంబరు.494/10, 11, 12లో 180.9089 హెక్టార్లను సున్నపురాయి మైనింగ్ కోసం ప్రభుత్వం కేటాయించింది. లీజు కాలాన్ని 30 ఏళ్లుగా నిర్ణయించింది. 2007 జూన్‌లో జెట్టిపాలెంలోని సర్వే నంబరు.426లో మరో 137.693 హెక్టార్లను 30 ఏళ్ల లీజుకు కేటాయించింది. ఆ తర్వాత ప్రభుత్వం ఈ రెంటింటిని కలిపి 317.900 హెక్టార్లకు ఒక లీజుగా మార్చింది. అలానే లీజు కాలాన్ని 2017లో 50 ఏళ్లకు పొడిగించింది. ఆ తర్వాత 2023లో దాచేపల్లి మైనింగ్ ఏడీ ప్రభుత్వానికి లేఖ రాస్తూ డీజీపీఎస్ సర్వేలో 331.681 హెక్టార్లను గుర్తించారు. అదనంగా ఉన్న 13.899 హెక్టార్ల గనుల్లో ఎలాంటి మైనింగ్ ఆపరేషన్స్ జరగలేదని నివేదించారు. గత ఏడాది సెప్టెంబరులో మైనింగ్ డైరెక్టర్ ఈ మేరకు సమగ్ర నివేదిక అందజేయగా ప్రభుత్వం గురువారం అదనంగా ఉన్న సున్నపురాయి గనులను తొలగించింది. అదేవిధంగా ఆ సంస్థకు 50 ఏళ్లకు కేటాయించిన లీజు ప్రకారం 317.900 హెక్టార్లను ఖరారు చేసింది.

పాత బకాయిలపై... సీటీ శాఖ కొరడా

● బకాయిల వసూళ్ళకు రంగంలోకి ప్రత్యేక బృందాలు

● వాహన తనిఖీలు ముమ్మరం

● రైల్వే పార్శిల్స్ రాకపోకలపై స్పెషల్ ఫోకస్

గుంటూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చే కీలక శాఖల్లో ఒకటైన వాణిజ్యపన్నులశాఖ పాత బకాయిల వసూళ్ళపై ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా ఆ శాఖ అధికారులు పాత బకాయి లు, జీఎస్టీ రిటర్న్ పెండింగ్ జాబితాలోనున్న వారిపై కొరడా ఝుళిపిస్తున్నారు. ఈ మేరకు ఆ శాఖలో జూని యర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగి నుంచి డీసీటీవో స్థాయి అధికారుల వరకు ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి బకాయి వసూళ్ళకు రంగంలోకి దించారు. అత్యవసరమైతే మినహా ఉద్యోగులకు శెలవులు కూడా ఇచ్చేది లేదని మౌఖి కంగా చెప్పినట్లు సమాచారం. గుంటూరు-1, పల్నాడు డివిజన్ల జాయింట్ కమిషనర్‌లు శ్రీ లక్ష్మీ, గీతామా ధురీలు బకాయిల వసూళ్ళపై కింది స్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వ్యాట్‌లో ఉన్న బకా యిలు కోట్ల రూపాయల్లో ఉన్నట్లు తెలిసింది. ముఖ్యంగా గుంటూరు-1 డివిజన్‌తో పాటు బాపట్ల డివిజన్ల పరిధిలోని సర్కిల్స్‌లో ఉన్న పాత బకాయిదారుల జాబితాలను సిద్ధం చేశారు. ఆయా బకాయిల వసూళ్ళ కోసం ప్రత్యేక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే గుంటూరు రైల్వే స్టేషన్ కేంద్రంగా రైళ్ళలో పార్శిల్స్ రాకపోకలపై వాణిజ్యపన్నుల శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉగాది, రంజాన్ పండుగలతో పాటు ఆర్థిక సంవత్సరాంతం కావటంతో పార్శిల్స్‌పై అధికారుల తనిఖీలు ముమ్మరం చేశారు. పార్శిల్స్‌లో వచ్చే ఉత్పత్తులకు బిల్లులను నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. మరో వైపు ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లోనూ పార్శిల్ ఉత్పత్తులను తనిఖీలు చేస్తున్నారు.



వాణిజ్యపన్నులశాఖ కార్యాలయం

చర్చనీయాంశంగా మారిన డ్రైవర్ల తొలగింపు

వాణిజ్యపన్నులశాఖలో అక్రమ వసూళ్ళకు పాల్పడ్డారన్న ఆరోపణపై వాహన తనిఖీల విధుల నుంచి పది మంది వరకు ప్రైవేటు వాహన డ్రైవర్ల తొలగించటం ఆ శాఖలో కలకలం రేకెత్తిస్తోంది. 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో గురువారం సీటీ శాఖలో పది మంది డ్రైవర్లపై వేటు అనే కథనం ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది. కాగా వాహన తనిఖీలు, పన్ను ఏగవేతదారుల నుంచి పెనాల్టీ వసూళ్ళు వంటి వివరాలను ఆ శాఖ అధికారులు కూడా గోప్యత పాటించటం కూడా చర్చనీయాంశంగా మారుతోంది.



జేసీ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, వ్యవసాయ కూలీలు

రోడ్డుకు ఇరువైపులా... భూమి సేకరించాలి

544డీ జాతీయ రహదారి భూసేకరణపై జేసీకి రైతుల వినతి

నరసరావుపేట టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు విస్తరణలో భాగంగా 544డీ జాతీయ రహదారికి ఇరువైపుల భూమి సేకరించాలని రైతులు కోరారు. గురువారం నరసరావుపేట కలెక్టరేట్‌లో జేసీ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాకాని, పెట్లూరివారిపాలెం, ఉప్పలపాడు, ఎస్సీ, బీసీ కాలనీల రోడ్డు మార్గాన రోడ్డు కుడివైపు మాత్రమే సర్వేచేసి, కావాల్సిన భూమిని తీసుకోవడానికి ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. రోడ్డు సెంటర్ పాయింట్ నుంచి 74+74=148 అడుగుల ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉందన్నారు. నేషనల్ హైవే 180 అడుగుల అవసరం ఉంటుందన్నారు. రెండు వైపులా భూమిని తీసుకుంటే ప్రభుత్వం వారికి 32 అడుగులు మాత్రమే అవసరం ఉంటుందని చెప్పారు. 16 అడుగుల వంతున ఇరువైపుల రైతుల నుంచి భూమిని సేకరిస్తే ప్రభుత్వానికి కూడా చాలా ఖర్చు తగ్గుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్డుకు ఇరువైపుల భూమి సేకరించి రైతులు, రైతు కూలీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం చేయాలని,వ్యవసాయ భూములను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్సాహంగా విద్యుత్‌శాఖ ఉద్యోగుల పోటీలు

● నేటితో క్రీడలు ముగింపు



పర్యావరణంపై చైతన్యవంతం చేసేలా మహిళా ఉద్యోగి వేషధారణ

గుంటూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఒత్తిడితో ఉండే విద్యుత్‌శాఖ మహిళా ఉద్యోగులు ఆ శాఖ కార్పొరేషన్స్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గుంటూరులో జరుగుతోన్న క్రీడా, సాంస్కృతిక పోటీల్లో ఆట పాటలు, క్రీడలతో ఉత్సాహంగా హాజరయ్యారు. ఎన్‌టీఆర్ స్టేడియం వేదికగా క్రీడలు జరుగుతుండగా, సంగడిగుంటలోని విద్యుత్ భవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. విద్యుత్‌శాఖలోని మహిళా ఉద్యోగులకు ఈనెల 19 నుంచి 21 వరకు క్రీడా, సాంస్కృతిక పోటీలు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రెండో రోజు గురువారం కూడా క్రీడల్లో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. చెస్, బ్యాడ్మింటన్‌లో సింగిల్స్ డబుల్స్ క్యారమ్స్ డబుల్స, టెన్ని కాయిడ్ విభాగాల్లో పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యుత్ భవన్‌లో కూడా ప్రజల్ని చైతన్యవంతం చేసే పర్యావరణానికి సంబంధించిన నాటికలు వేసి స్ఫూర్తి నింపారు. అనంతరం విజేతల పేర్లను ప్రకటించారు. కార్యక్రమంలో గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి, బాపట్ల ఎస్ఈ ఆంజనేయులు, గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు పలువురు అధికారులు ఉన్నారు.

దుగ్గిరాల మార్కెట్‌లో 243 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, మార్చి 20(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో గురువారం జరిగిన వేలంలో 243 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,150, గరిష్ఠధర రూ.9,950, మోడల్‌ధర రూ.9,950 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.9,950, గరిష్ఠధర రూ. 10,000, మోడల్‌ధర రూ. 9,950 పలికాయి.

ప్రజా సమస్యల పరిష్కారానికి 25న ధర్నా

మంగళగిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా చైతన్య యాత్రల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 25వ తేదీన ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు తెలిపారు. మంగళగిరి సీపీఎం కార్యాలయం గురువారం సాయంత్రం డి.నరసింహారావు అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేసిన తర్వాత అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని, ఏ చిన్న సమస్య వచ్చినా సచివాలయం వద్దకు వెళితే ఇక్కడ కాదు మంగళగిరి వెళ్లండంటూ ఉచిత సలహా ఇస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో మురుగు పారుదల అస్తవ్యస్తంగా ఉందని, తాగునీటి సమస్య వేధిస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా ఆ ఊసే ఎత్తడంలేదని విమర్శించారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం 25న జరిగే ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి దుర్గారావు, నేతలు అజయ్, బాబూ వరప్రసాద్, శివశంకరరావు, పకీరయ్య, వల్లూరి భారతి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ శ్రమ - అధిక ఆదాయం



ప్రసంగిస్తున్న ఖాదీగ్రామీణ పరిశ్రమల రాష్ట్ర సంచాలకులు డాక్టర్ ఎస్ గ్రీస్

తాడేపల్లి టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ ఉద్యోగ వికాస యోజన ద్వారా తక్కువ శ్రమతో అధిక ఆదాయం పొందవచ్చని ఖాదీగ్రామీణ పరిశ్రమల రాష్ట్ర సంచాలకులు డాక్టర్ ఎస్ గ్రీస్ అన్నారు. వ్యవసాయ ఆధారిత ఆహార పరిశ్రమలు (ఆగ్రో బేస్డ్ ఫుడ్ ఇండస్ట్రీస్) అవగాహన సదస్సును నులకపేటలోని చైతన్య తపోవన్‌లో నిర్వహించారు. మెరుగైన టూల్స్ ఎక్విప్‌మెంట్ ద్వారా బహుళ ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంచాలకులు రమేష్, డిప్యూటి డైరెక్టర్ ఆనంద కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ఎల్ మూర్తి, కమిషనర్ టీవీ రావు, ఎగ్జిక్యూటివ్ విజయ రాయి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని జార్ఖండ్ వ్యక్తి మృతి



ముళ్ల చెట్టుకు వేలాడుతున్న మృతదేహం

తాడేపల్లి టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని తాడేపల్లిలో మృతి చెందాడు. తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి వివరాల ప్రకారం తాడేపల్లి పరిధిలోని కృష్ణా కెనాల్ రైల్వే జంక్షన్ సమీపంలో ఉన్న అంజిరెడ్డి కాలనీ వద్ద ఉన్న ముళ్ల చెట్టుకు మృతదేహం వేలాడుతోందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారన్నారు. మృతదేహాన్ని కిందకు దింపి సదరు వ్యక్తి షర్టు జేబులో దొరికిన ఆధార్‌కార్డు ప్రకారం జార్ఖండ్ రాష్ట్రం గుమ్లా జిల్లా బాకీటోలి గ్రామానికి చెందిన సులేమాన్ టర్కి (32)గా గుర్తించామని ఎస్ఐ తెలిపారు. మృతుడు హౌరా నుంచి సికింద్రాబాద్ వెళుతున్నట్టు రైల్వే టికెట్ ఉందని తాడేపల్లిలో ఎందుకు దిగి ఆత్మహత్య చేసుకున్నాడో వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

మేడికొండూరు మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని సిరిపురం గ్రామంలో గురువారం వెలుగు చూసింది. ఈ సంఘటనపై మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం పొడపాడు గ్రామానికి చెందిన మంత్రి విద్యాసాగర్(33) సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. సిరిపురం గ్రామంలోని బావిలో అతడి శవం ఉండగా పంచాయతీ అధికారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అధికారులు చెరువులో ఉన్న మంచినీటి బావి వద్దకు వెళ్లి చూడగా మృతదేహం నీటిలో తేలియాడుతూ కనిపించింది. అనంతరం రంగంలోకి దిగిన మేడికొండూరు పోలీసులు విచారించగా మృతుడు విద్యాసాగర్‌గా గుర్తించారు. సిరిపురం సమీప గ్రామమైన పొడపాడులోని విద్యాసాగర్ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అక్కడ చేరుకున్న విద్యాసాగర్‌కుటుంబ సభ్యులను పోలీసులు విచారించారు. విద్యాసాగర్ అవివాహితుడని సోమవారం పనికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడని మృతుడి సోదరుడు శ్రీకాంత్ పోలీసులకు తెలిపాడు. విద్యాసాగర్ మృతికి గత కారణాలు తెలియరాలేదు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి తరలించారు.

‘స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రప్రదేశ్’ లక్ష్యానికి తూట్లు

- డంపింగ్‌యార్డు ఉన్నా ప్రధాన రహదారివెంటే చెత్తకుప్పలు
- పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్థుల ఆగ్రహం
- క్షేత్రస్థాయిలో కనబడని కార్యక్రమాలు



ఆర్‌అండ్‌బీ రహదారిపై చెత్త వేయడంతో నిరసనవ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

పెదనందిపాడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పెదనందిపాడులో గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంపై జనం మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలల్లో ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ గ్రామాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేస్తూ అధికారులు ప్రతి 3వ శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రప్రదేశ్ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. కానీ అధికారులు మొక్కుబడిగా కార్యక్రమం నిర్వహించి, ఫోటోలు దిగి మమ అనిపిస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. గ్రామంలో డంపింగ్‌యార్డు ఉన్నా ఉపయోగం లేదని ప్రజలు వాపోతున్నారు. తడి పొడి చెత్తలను డంపింగ్ యార్డుకు తరలించి తద్వారా పంచాయతీలకు వనరులు సమకూర్చుకోవడం మరిచి గ్రామాల్లో సేకరించిన చెత్తలను గుంటూరు - పర్చూరు ప్రధాన రహదారి వెంట వేయడంతో అటు ప్రయాణికులు, ఇటు పాదాచారులు ముక్కుపుటలదిరే దుర్వాసనతో అల్లాడిపోతున్నారు. సమీపంలోనే ప్రభుత్వాసుపత్రి ఉండడంతో అక్కడ పనిచేసే సిబ్బందితో పాటు వచ్చే రోగులు సైతం చెడువాసనలు భరించలేకపోతున్నారన్నారు. రోడ్డు పక్కనే చెత్తకుప్పలుగా పడవేయడంతో వాహనాల్లో వెళ్లే వారు సిగిరెట్‌లు తాగి విసిరేయడంతో పలుమార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయని, అయినా పంచాయతీ అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని ఇందుకు ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపమే కారణమని గ్రామస్థులు అధికారులపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు వెంట వేసిన చెత్తకుప్పలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పెనుమాక రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు

- 510 మంది రైతులకు మొత్తం 1352 ప్లాట్ల కేటాయింపు
- సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ ఆవరణలో ఈ - లాటరీ నిర్వహణ



ఈ లాటరీ విధానంలో రైతులకు ప్లాట్లను కేటాయిస్తున్న సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు

తుళ్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక గ్రామ రైతులకు సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. పెనుమాక గ్రామానికి చెందిన 510 మంది రైతులకు గురువారం విజయవాడలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ-లాటరీ విధానం ద్వారా మొత్తం 1,352 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. వీటిలో 787 నివాస ప్లాట్లు కాగా 565 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ఈ- లాటరీ విధానంలో సీఆర్‌డీఏ అధికారులు రైతులకు కేటాయించారు. ఈ - లాటరీకి హాజరైన రైతులకు ముందుగా సీఆర్‌డీఏ అధికారులు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ఏ విధంగా ప్లాట్లను కేటాయిస్తారో ట్రయల్ రన్ వేసి చూపించారు. ఆ తర్వాత అసలైన లాటరీ ప్రక్రియను చేపట్టారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లను అందచేశారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు మాట్లాడుతూ రైతుల సహకారంతోనే ప్రపంచస్థాయిలో అమరావతి రాజధాని నిర్మాణం జరుగుతోందని అన్నారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు కేటాయించిన ఎల్పీఎస్ లేఅవుట్లలో అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేసుకోవాలని కోరారు. ఎల్పీఎస్ భూముల్లో అభివృద్ధి పనులు మొదలౌతున్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆలస్యం కాకుండా కొత్తగా 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించామో వివరించడానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఆఫీస్ మేనేజ్‌మెంట్) వల్లభనేని శ్రీనివాసరావు, సీఆర్‌డీఏ ల్యాండ్స్ విభాగ జాయింట్ డైరెక్టర్ డేవిడ్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఏజీ చిన్నికృష్ణ, వసంత రాయుడు, ప్రిన్సిపాల్ ప్లానర్ ఆర్ నాగేశ్వరరరావు, సీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థను సందర్శించిన ఎన్‌డీసీ ప్రతినిధులు



రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థకు విచ్చేసిన ఎన్‌డీసీ మేజర్ జనరల్ సంగ్రా తదితరులు

తాడేపల్లి (కుంచనపల్లి), మార్చి 20(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కుంచనపల్లిలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని నేషనల్ డిఫెన్స్ కాలేజి (ఎన్‌డీసీ) విశ్రాంత మేజర్ జనరల్ సీపీ సంగ్రా, సభ్యులు గురువారం సందర్శించారు. రెవెన్యూ శాఖ (లాండ్స్, విపత్తుల నిర్వహణ, స్టాంప్స్, రిజిస్ట్రే షన్) ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తుఫాన్లు, వరదలు, వడగాల్పులు, భారీ వర్షాలు పిడుగుపాటు హెచ్చరికల వ్యవస్థల గురించి ఎన్‌డీసీ బృందానికి వివరించారు. స్టేట్ ఎమర్జెన్స్ ఆపరేషన్ సెంటర్లో సిబ్బంది 24 గంటలూ పర్యవేక్షిస్తారన్నారు. గత ఏడాది బుడమేరు ముంపును ఎదుర్కొనడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వెల్లడించారు. అపార్టుమెంట్ వాసులకు అహారం, వాటర్, మెడిసిన్ వంటి అత్యవసర సదుపాయాలు అందించేందుకు డ్రోన్లు వినియోగించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఎన్‌డీసీ సభ్యులు విజయవాడ వరదల్లో ఏపీ ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు. ఈ సమావేశంలో ఏపీఎస్‌డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్, ఎన్‌డీఆర్ఎఫ్ కమాం డెంట్ నిరంజన్, ఎన్‌డీసీ సివేంద్ర, ఆకాష్, అమితోజ్, కాటర్, ట్యాంగో, మంజిత్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న అబద్దయ్య, జానకీదేవి తదితరులు

మంగళగిరి సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను స్థానిక నేతలు గురువారం పంపిణీ చేశారు. 6వ వార్డుకు చెందిన ఆకులూరి ప్రసన్నకుమార్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. ప్రసన్నకుమార్ ఆరోగ్య, ఆర్థిక పరిస్థితిని గురించి స్థానిక నేతల ద్వారా తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్ సీఎం చంద్రబాబుతో మాట్లాడి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. ప్రసన్నకుమార్‌కు రూ.8,41,988లు మంజూరయ్యాయి. అలాగే, 15వ వార్డుకు చెందిన మంచాల శ్యామ్‌సుందర్‌కు రూ.50,891, 12వ వార్డుకు చెందిన మహమ్మద్ సాధిక్‌కు రూ.20,541లు, 9వ వార్డుకు చెందిన గంజి లీలకు రూ.లక్షా 290ల చొప్పున మంజూరైన చెక్కులను నేతలు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య మాట్లాడుతూ వైద్య ఖర్చులు భారమై ఆర్థిక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న పేదలకు ఆపన్న హస్తం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నేతలు మహమ్మద్ ఇబ్రహీం, మాజేటి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు గ్రామాల్లో ముఖ్యమంత్రి సహాయనిధి నగదు చెక్కులను గురువారం స్థానిక టీడీపీ నాయకుల చేతులమీదుగా అందించారు. పెదపాలెంకు చెందిన వసంతకుమారికి రూ.31,843ల చెక్కును మండల అధ్యక్షురాలు శ్రీఅనిత, పాటిబండ్ల సాయికృష్ణ, ఎంపీటీసీ పుతుంబాక సాయి కృష్ణలు గురువారం అందించారు. దుగ్గిరాల యార్డు మాజీచైర్మన్ పాటిబండ్ల కృష్ణప్రసాద్, ఈమనికి చెందిన చెన్నంశెట్టి వెంకటేశ్వర రావుకు రూ.లక్ష, పెదకొండూరు గ్రామస్థుడు మల్లెల ఆదియ్యకు రూ.60,437, వెలివెల రామాంజనే యులుకు రూ.37,560, బిక్కసాని సింధుకు రూ.50,497, శృంగార పురంకు చెందిన రాచూరి పాపకు రూ.24వేలు నగదు చెక్కులను అందించారు. ఎంపీటీసీ విశ్వనాధపల్లి శివకుమార్, కొండూరు ముత్తయ్య, అంకమయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రత్యేక పారిశుధ్య పనులు



స్వచ్ఛ మంగళగిరిపై కరపత్రాలు పంచుతున్న అధికారులు, కూటమి నేతలు

మంగళగిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ మంగ ళగిరి కార్యక్రమంలో భాగంగా ఎంటీఎంసీ పరిధిలో ప్రత్యేక పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నాలుగో రోజైన గురువారం మంగళగిరి పట్టణంలోని 5, 6 వార్డుల పరిధిలో ఇందిరా నగర్, మూడు పంపుల సెంటర్, స్కూల్ రోడ్డు, తాడేపల్లి పట్టణంలోని మూడో వార్డులో అధికారులు, కూటమి నాయకులు పారిశుధ్య పనుల్లో పాల్గొన్నారు. రోడ్లపై చెత్తను ఏరివేసి శుభ్రం చేశారు. స్వచ్ఛ మంగళగిరిపై ప్రజలకు అవ గాహన కల్పిస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా మాట్లాడుతూ ప్రజలందరూ పరిసరాల శుభ్రతపై అవగాహన పెంచుకుని పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా తడి-పొడి చెత్తను వేరు చేసి సిబ్బందికి అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ కే శకుంతల, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, కార్యదర్శి ఎం దివ్య కుమారి, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు ముమ్మిడి సత్యనారాయణ, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు దార్శనికతకు గేట్స్ ఫౌండేషన్‌తో ఒప్పందమే నిదర్శనం

కాకుమాను, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు దార్శనికతకు గేట్స్ ఫౌండేషన్‌తో కుదిరిన ఒప్పందమే నిదర్శమని టీడీపీ నాయకులు గురువారం అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు సునీల్‌చౌదరి, కొల్లా వీరయ్య చౌదరి మాట్లాడుతూ హైదరాబాద్‌ను సైబరాబాద్‌గా మార్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. తెలుగు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన ఐటీ రంగంలో అగ్రగామిగా ఉన్న బిల్‌గేట్స్ రాష్ట్రంలో అనేక నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

107వ రోజుకు చేరిన ఫ్యాక్టరీ కార్మికుల దీక్షలు

తాడేపల్లి టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కోర్టు తీర్పుల ప్రకారం తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం తాడేపల్లి ఏసిసి సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 107వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటియూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు యూనియన్ నేతలు కొర్రపాటి ఆదినారాయణ, ప్రారంభించారు. దీక్షల్లో కే మోహనరావు, హగ్గయి, ఇశ్రాయేలు, సాంబయ్య, ఇమాంబి, కూర్చున్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లనే సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంకయ్య, ఆశీర్వాదం, సుబ్బారావు, రమాదేవి, దుర్గభవాని, లక్ష్మి ప్రకాశరావు, శివమ్మ రహంతుల్లా, యెహోషువ తదితరులు పాల్గొన్నారు.


క్షయవ్యాధిపై ఇంటింటి అవగాహన

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పోషకాహర లోపంతో వ్యక్తిలో రోగ నిరోధక శక్తి క్షీణించడం ఎయిడ్స్, మధుమేహం, ధూమపానం, మద్యపానం, క్యాన్సర్ బాధితులకు క్షయ వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్రవర్తి పేర్కొన్నారు. మండలంలోని చిర్రావూరులో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సీఎస్ఈ ఆనర్స్ ఫార్మసీ కళాశాల వలంటీర్లు క్షయవ్యాధి ఎలా వ్యాపిస్తుందని, చికిత్స విధానం నివారణ మార్గాలు అనే అంశాలపై ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. డాట్స్ చికిత్స విధానంతో మందులు సరిగ్గ తీసుకుంటే ఆరు నెలల్లో వ్యాధి తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఆర్ సుప్రియ, విద్యార్థి విభాగాధిపతి, డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, ఫీల్డ్ కోఆర్డినేటర్ సురేష్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో చర్మ సంరక్షణపై అవగాహన సదస్సు

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో గురువారం ఉమన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో చర్మ సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. విజయవాడలోని అక్కినేని ఆస్పత్రి వైద్యురాలు ప్రముఖ చర్మవ్యాధుల నిపుణురాలు డాక్టర్ మనస్విత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వేసవిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎండలో ఉండకూడదన్నారు. సూర్యుడి యూవీ కిరణాలు మేఘాల గుండా శరీరంపై పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వీసీ సారధి వర్మ, ప్రోవీసీలు కే రాజశేఖరరావు, ఏవీఎస్ ప్రసాద్, వెంకటరామ్, రిజిస్ట్రార్ సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్ చార్జి డీన్ కేఆర్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటాలకు పాలాభిషేకం



అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉండవల్లి శ్రీదేవి

తాడేపల్లి టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం ఆమోదం తెలపడంతో రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు నివాళులర్పించి పాలాభిషేకం చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణమాదిగకు వర్గీకరణకు సహకరించిన సీఎం చంద్రబాబుకు ఎంతో రుణపడి ఉంటామని ఆమె అన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది వివిధ జిల్లాల నుంచి వచ్చిన నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫింగర్ ప్రింట్ స్కానర్‌లు పంపిణీ

తుళ్లూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఫింగర్ ప్రింట్ స్కానర్‌లను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శిల్ప గురువా రం పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రతీ పింఛన్ పంపిణీ అధికారికి ఫింగర్ ప్రింట్ స్కానర్‌లు 235 అందజేసినట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఏఎన్ఎంల ఆందోళన



ప్రదర్శన నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు, అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఆరోగ్య కార్యదర్శులు, ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ ఏఎన్ఎం అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మంగళగిరిలో ఆందోళన చేపట్టారు. తొలుత మంగళగిరి ఆటోనగర్ నుంచి ఏపీఐఐసీ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి, అక్కడ కొద్దిసేపు ధర్నా చేశారు. అనంతరం వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జీ వీర పాండియన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలు ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్నప్పటికీ వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి బీవీవీ కొండలరావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లీలావతి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ రావు, కంచర్ల కాశయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తుదిదశకు చేరుకున్న డీఆర్‌బీసీ వాగుపై వంతెన పనులు



వంతెన స్లాబ్‌పనులను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఎంపీపీ జబీన్, జడ్పీటీసీ అరుణకుమారి తదితరులు

దుగ్గిరాల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): చిలువూరు రెండేళ్లుగా నిలిచిపోయిన డీఆర్‌బీసీ వాగుపై వంతెనకు గురువారం స్లాబ్ వేయడంతో ఎస్సీ కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2023 మార్చి 20న వంతెన నిర్మాణానికై, రూ. 42.86లక్షల ఎంపీ నిధు లు మంజూరు చేశారు. వంతెన పనులు ప్రారంభించి వదిలేయడంతో ప్రజలు రెండేళ్లుగా అవస్థలు పడ్డారు. కాలనీ ప్రజలు కనీసం ఆటోలో వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక స్థానిక నాయకులు ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. మంత్రి నారాలోకేశ్ ఆదేశాలతో ఊపందుకున్న పనులతో ఎట్టకేలకు వంతెన స్లాబ్ దశకు చేరుకుంది. పనులను ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, జడ్పీటీసీ మేకతోటి అరుణకుమారి, సర్పంచ్ చిలువూరు మాణిక్యం, ఎంపీటీసీ చిలువూరు రోజమరియమ్మ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు తోటకూర సీతారామయ్య, శేషగిరి, ఏసుపాదం, తదితరులు స్లాబ్‌పనులను టెంకాయలు కొట్టి ప్రారంభించారు.

నేటి నుంచి విజ్ఞాన్ నిరులోత్సవ్ 2కే25



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు(విద్య), మార్చి 20(ఆంధ్రజ్యోతి): పలకలూరులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నుంచి రెండురోజుల పాటు జాతీయస్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక గురువారం తెలిపారు. మొత్తం 45 అంశాల్లో పోటీలు జరుగుతాయని వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ముఖ్యఅతిథిగా విజ్ఞాన్ నిరులోత్సవ్ 2కే25 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక మాట్లాడుతూ మొదటిరోజు జరిగే ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీఎస్‌సీహెచ్‌ఈ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యు కేషన్) చైర్మన్ ప్రొఫెసర్ కే మధుమూర్తి హాజరవుతారన్నారు. శనివారం జరిగే ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పాల్గొంటారన్నారు. దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్, ఎంబీఏ విద్యార్థులతోపాటు డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు కూడా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

ముగిసిన సీఎస్‌సీ సర్టిఫికెట్ కోర్సు

తాడికొండ(లాంఫాం), మార్చి 20(ఆంధ్రజ్యోతి): లాంఫాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో 15 రోజుల పాటు నిర్వహించిన కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ), విలేజ్ లెవెల్ ఎంటర్‌ప్రెన్యూర్స్(వీఎల్ఈ) సర్టిఫికెట్స్ కోర్సు ముగింపు సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సీఎస్‌సీ కోఆర్డినేటర్ సయ్యద్ సైదా వలి మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమంలో శాస్త్రవేత్తలతో వివిధ పంట సాగు వివరాలు, ఎరువులు, పురుగులు తెగుళ్ల యాజమాన్యం, నేల ఆరోగ్యం, సేంద్రియ వ్యవసాయం, జీవ నియంత్రణ, జీవన ఎరువులు, జీవ రసాయనాలు, డ్రోన్ల వినియోగం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారన్నారు. శిక్షణ పొందిన రైతులు వారి పరిజ్ఞానాన్ని ఇతర రైతులకు అందించి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. శిక్షణలో పాల్గొన్న 29 మందికి సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు జీ శివన్నారాయణ, సీఎస్‌సీ స్టేట్ హెడ్ రవికుమార్, ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్, సీహెచ్ శ్రీలతావాణి పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రతి కుటుంబం నుంచి చెత్తసేకరణ జరగాలి

- డీపీవో నాగసాయికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో నాగసాయికుమార్

ప్రత్తిపాడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు ప్రతి కుటుంబం నుంచి చెత్త సేకరణ చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి నాగసాయి కుమార్ అన్నారు. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డులో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణపై రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ సిబ్బంది హాజరయ్యారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో డీపీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చెత్తను వేరే చేసే విషయంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగమల్లేశ్వరి, డీఎల్‌పీవో కె శ్రీనివాసరావు, ఎంపీడీవో శివపార్వతి, ఈవోపీఆర్డి రవి కుమార్, పంచాయతీ సెక్రటరీ ఖాజా పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అజయ్‌కుమార్

మేడికొండూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కౌలు రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం గుంటూరు జిల్లా కమిటీ సభ్యుడు కే అజయ్ కుమార్ చెప్పారు. సీపీఎం ప్రచార యాత్ర సందర్భంగా పార్టీ నాయకులు దుర్గం వీర అంజనేయులు అధ్యక్షతన గురువారం మేడికొండూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం ఏరియాశాఖ కార్యదర్శి బాషా, నాయకులు చిలకయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

రైలు ఢీకొని యువకుడు మృతి



పంది గోపీకృష్ణ (ఫైల్ ఫొటో)

పెదకాకాని, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన పెదకాకాని వద్ద బుధవారం రాత్రి జరిగింది. పెదకాకాని సుందరయ్య కాలనీకి చెందిన పంది గోపీకృష్ణ (31) లారీ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. బుధవారం అర్ధరాత్రి మల విసర్జనకు పెదకాకాని రైల్వే హాల్ సమీపంలోని రైల్వే పట్టాల వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో గోపీకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రెయిన్ వెంబడి రైతు బజారుకు ఏర్పాట్లు

● ఇరుకు రహదారి, పక్కన మురుగు దుర్గంధం
● మద్యం దుకాణాల మధ్య ఏర్పాటుపై వ్యతిరేకత



జంపని డ్రైన్ వెంబడి ఏర్పాటు చేసిన రైతు బజారు షెడ్డు



మందుబాబులు మూత్రవిసర్జన చేసే జంపని డ్రెయిన్ ప్రాంతం

తెనాలి అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని రైతు బజారును అపరిశుభ్ర ప్రదేశంలో పెట్టేందుకు ఏర్పాటు చేయడంపై వినియోగదారులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బోసురోడ్డులో జీడీసీసీ బ్యాంకు ఎదుట ఉన్న రైతు బజారును ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద జంపని డ్రెయిన్ వెంబడి ఏర్పాటు చేసేందుకు గాను షెడ్డును నిర్మించారు. బోసురోడ్డులో రైతు బజారు వలన వాహనాల పార్కింగ్, ఎక్కువగా ఆవులు రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని మునిసిపల్ అధికారులు రైతు బజారు తరలించాలని నిర్ణయం తీసుకున్నారు. పట్టణంలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లోని మురుగు అంతా ఇక్కడకు చేరి జంపని డ్రెయిన్ మొదలవుతుంది. డ్రైన్‌లో మురుగునీరు పెద్ద ఎత్తున నిల్వ ఉండి నిత్యం దుర్గంధం వస్తుంటుంది. షెడ్డు వెంట ఉన్న ఖాళీ ప్రదేశంలో డ్రెయిన్‌లో వ్యర్థాలు, మ్యాన్ హోల్ కింద వ్యర్థాలు చేరుతూ ప్రతివారం పెద్ద ఎత్తున వాటిని తొలగిస్తుంటారు. వర్షాకాలంలో బోసురోడ్డులో నిలిచే నీటిని తొలగించే క్రమంలో ఇక్కడ పూడిపోయిన వ్యర్థాలు తొలగించే పని నిత్యకృత్యంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో మందుబాబులు మూత్రవిసర్జన చేస్తుంటారు. షెడ్డు వెనుక మద్యం దుకాణం ఉంది. ఈ రోడ్డు అంతా మందుబాబులతో కోలాహలంగా ఉంటుంది. మందుబాబుల దెబ్బకు రైతు బజారుకు మహిళలు వచ్చి వెళ్ళే అవకాశం ఉందా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మరో పక్క సులభ్ కాంప్లెక్సు నిర్వహిస్తున్నారు. ఈ రహదారి ఇరుకు కావడంతో రైతు బజారుకు వచ్చే వినియోగదారుల వాహనాలు రోడ్డుపై పార్కింగ్ చేస్తే బోసురోడ్డులో నుంచి దేవీచౌక్‌కు వెళ్ళే అవకాశం ఉండదు. రైతు బజారు కోసం ఏర్పాటుచేసిన షెడ్డులోని రెండు విద్యుత్ స్తంభాలు కూడా తొలగించకుండా గోడలో కలిపేశారు. వర్షాకాలంలో స్తంభాల వెంట నీరు దిగి కూరగాయలు దెబ్బతింటాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మందుబాబుల దెబ్బకు కూరగాయలు ఎలా కాపాడుకోవాలని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పెచ్చులూడుతున్న మునిసిపల్ భవనం

పెచ్చులూడుతున్న మునిసిపల్ భవనం వరండా

తెనాలి అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయ భవన వరండాలో శ్లాబ్ పెచ్చులూడుతోంది. నిత్యం సందర్శకులు వచ్చి వెళ్ళే మార్గంపై సీలింగ్ చాలా వరకు ఇనుప చువ్వలు తుప్పుపట్టి శ్లాబ్ పెచ్చులు విరిగిపడుతున్నాయి. వరండాలో కూడా టైల్స్ పగిలిపోయి గుంతపడింది. ఇది గమనించకుండా వెళ్ళే వారికి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మునిసిపల్ అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

కొనసాగుతున్న సదరం రీ వెరిఫికేషన్

తెనాలి రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో వారంలో మూడు రోజులు నిర్వహించే సదరం రీ వెరిఫికేషన్ ప్రక్రియ రెండో రోజు గురువారం కొనసాగింది. వివిధ విభాగాల వైద్యనిపుణులు సదరం సర్టిఫికెట్ పొంది పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులను రీ వెరిఫికేషన్ ద్వారా వారి వైకల్యశాతాన్ని పరీక్షించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దాదాపుగా 100మంది వరకూ హాజరై పరీక్షలు చేయించుకున్నట్లు వైద్యశాల వర్గాలు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఉపాధ్యాయులు తగిన శ్రద్ధచూపాలి

● ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ చూపాలని ఎంఈవో సాల్మన్‌రాజు సూచించారు. గురువారం మండల పరిధిలోని తూములూరు, కొల్లిపర, చివలూరు ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ నిర్వహించారు. పాఠశాలల్లో రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టీలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందన్నారు. ప్రతి నెల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల యొక్క పురోగతిని వారికి తెలియజేయాలన్నారు. మధ్యానభోజన పథకాన్ని కూడ సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పాఠశాలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

డ్వాక్రా మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

● యూబీఐ చీఫ్ మేనేజర్ హరిప్రసాద్

తెనాలి రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు బ్యాంకు ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సంగం జాగర్లమూడి యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ హరిప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని సంగం జాగర్లమూడిలో డ్వాక్రా మహిళా సంఘాలకు రుణ మేళా కార్యక్రమం నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ కిషోర్, యానిమేటర్లు, పలు గ్రూపుల సభ్యులు, బ్యాంక్ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలుగు యువత ఆధ్వర్యంలో ఇఫ్తార్

తెనాలి రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగు యువత ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు చేసినట్లు టీడీపీ నాయకులు పాలడుగు ప్రణీత్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6.30కు తెనాలి నందులపేటలోని జెండా చెట్టురోడ్డులోని తెలుగు యువత కార్యాలయం వద్ద తెలుగు యువత కొల్లూరు శ్రీధర్ మిత్రబృందం, పాలడుగు ప్రణీత్ మిత్రబృందం ఆధ్వర్యంలో నిర్వహించే ఇఫ్తార్ విందులో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని ప్రారంభిస్తారన్నారు. నియోజవర్గంలోని ముస్లింలు, కుటుంబసభ్యులు, కూటమి శ్రేణులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ నూతన కార్యవర్గం ఎన్నిక

తెనాలి అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా విజయలక్ష్మీ, ప్రధాన కార్యదర్శిగా ఎలిజిబెత్, ఉపాధ్యక్షురాలిగా ఆదిలక్ష్మి, రంగపుష్ప, కార్యదర్శులుగా పావని, సునీత, నిర్మల, కోశాధికారిగా రజియా బేగం, కార్యవర్గ సభ్యులుగా వెంకటలక్ష్మి, రాధిక, లావణ్య, జరీనా, భాగ్యలక్ష్మి, రాజకుమారి, విజయలక్ష్మి, హసీనా, కళాదరిలు ఎన్నికయ్యారు.

ప్రజల సహకారంతో స్వచ్ఛ తెనాలి సాధ్యం

అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ జగనాథ్



ప్రజల సమస్యలను అడిగి తెలుసుసుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ జగనాథ్, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే స్వచ్ఛ తెనాలి సాధ్యమవుతుందని అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగనాథ్ అన్నారు. గురువారం స్థానిక నాజరుపేటలోని 8వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగనాథ్ మునిసిపల్ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు తమ సమస్యలను అసిస్టెంట్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అధికారులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ పనులను సక్రమంగా నిర్వహించాలని వార్డుల్లో వచ్చే చెత్త వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపటిన స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర సాధనకు ప్రతిఒక్కరూ సహకరించాలని అప్పుడే అది సాధ్యం అవుతుందని అన్నారు.

అనంతరం 9, 16వ వార్డులలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, శానిటేషన్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ పంచాయతీల ముఖ్య విధి

జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం కో ఆర్డినేటర్ పద్మరాణి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పంచాయతీల ప్రథమ కర్తవ్యమని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం కో ఆర్డినేటర్ ఎస్.పద్మరాణి అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వద్ద గురువారం చేబ్రోలు వట్టిచెరుకూరు మండలాల పంచాయతీ సిబ్బందికి చెత్త నిర్వహణపై శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామాలలో పరిశ్రమలు, దుకాణాలు, గృహాల నుంచి సేకరించే ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. తడి, పొడి, హానికారక చెత్తలను వేరుచేసే విధానంపై అవగాహన కల్పించారు. గృహాలలో యజమానులకు తడి, పొడి చెత్తను వేరువేరుగా అందజేసే విధానం గురించి పలు సూచనలు చేశారు. పొడి చెత్తను విక్రయించడం, తడి చెత్తను వర్మీ కంపోస్టుగా మార్చడం, వాటి నుంచి సంపద తయారు చేసే లక్ష్యాలను సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణపై ముద్రించిన కర పత్రాలను ఆవిష్కరించారు. చెత్తను ప్రాసెసింగ్ విధానం చేసి పంచాయతీలకు సంపద సృష్టించేందుకు సిబ్బంది పనిచేయాలని కార్యక్రమంలో తెలియజేశారు. ఈ శిక్షణ తరగతులలో కొప్పాక లలిత, స్థానిక సర్పంచ్ వినతీరాణి, ఈవోపీఆర్డి ఉషారాణి, అనురాధ, ఫినిష్ సొసైటీ డివిజన్ కో ఆర్డినేటర్ ఏ రవికిరణ్, ప్రసాద్, రెండు మండలాల పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్‌లు పాల్గొన్నారు.



ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాల వివరాలు పరిశీలిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అకౌంట్ అధికారి పద్మజ, కమిటీసభ్యులు

ప్రైవేట్ ఆసుపత్రులలో సిజేరియన్ ప్రసవాలే అధికం

● వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అకౌంట్ అధికారి పద్మజ

తెనాలి రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గర్భిణులకు సాధారణ ప్రసవాలు అయ్యేలా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు జరుపుతుంటే తెనాలిలో మాత్రం ప్రైవేట్ వైద్యశాలల్లో నూటికి తొంబైశాతం సిజేరియన్ డెలివరీలు జరుగుతున్నాయని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అకౌంటెంట్ ఊటుకూరి పద్మజ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో ప్రైవేట్ ఆసుపత్రులలో జరుగుతున్న డెలివరీలకు సంబంధించిన రికార్డులను ఆమె తనిఖీ చేశారు. రికార్డులలో శస్త్రచికిత్సకు ప్రేరేపించిన కారణాలను పొందుపరచకపోవడంపై అధికారులను నిలదీశారు. పూర్తి నివేదికతో ప్రభుత్వానికి అందజేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

టిడ్కో గృహాలలో సమస్యలు పరిష్కరించాలి

● సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండా లక్ష్మీనారాయణ

పొన్నూరు టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహ సముదాయాలలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురువారం సీపీఎం నాయకుడు టిడ్కో గృహ సముదాయాలు, జగనన్న కాలనీలను సందర్శించారు. కాలనీలలో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు తెలియజేశారు. స్థానికంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, వైద్యశాల, శ్మశాన వాటికలు లేకపోవడం వలన కలుగుతున్న ఇబ్బందులను స్థానికులు సీపీఎం నాయకులు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ టిడ్కో గృహాలు, జగనన్న కాలనీలలో సుమారు 6300 కుటుంబాల ప్రజలు నివసించనున్నారన్నారు. అధికారులు తక్షణమే స్పందించి కాలనీలలో ప్రజలకు అవసరమైన తాగునీరు, మురుగు కాలువల నిర్మాణం, రహదారులు, పాఠశాలలు, వైద్యశాల వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నిమ్మకూరి రమేష్‌బాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్

తెనాలి, మారీసుపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని పలు వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. అనంతరం పట్టణంలోని 8, 9, 10 వార్డులలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించి శానిటేషన్ సిబ్బందికి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దారి మళ్లిన నిధులపై విచారణ జరపాలి

● అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరు టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 2019 నుంచి 2024 వైసీపీ ప్రభుత్వ హయాంలో దారి మళ్లిన నిధులపై విచారణ జరపాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ శాసనసభలో గురువారం ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 92 కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. అయితే ఈ పథకాలకు సంబంధించి పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం చెల్లించినట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారన్నారు. కేంద్ర ప్రాయోజిక పథకాలకు కేంద్ర ప్రభుత్వం చెల్లించిన నిధులు ఎంత, వాటిని వైసీపీ ప్రభుత్వం ఎక్కడకు మళ్లించింది వంటి వివరాలను సభ ముందు ఉంచాలని కోరారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కరోన వంటి విపత్తు వస్తే కేంద్ర ప్రభుత్వం మృతులకు రూ.50వేలు చెల్లించాలని రూ.1100 కోట్లు రాష్ట్రానికి మంజూరు విడుదల చేసిందన్నారు. ఆ నిధులను కూడా వైసీపీ పాలకులు మళ్లించారని ఆరోపించారు. ఈ నిధుల మళ్లింపు వ్యవహారంపై విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ప్రభుత్వాన్ని కోరారు.

అమృత కలశానికి ప్రత్యేక పూజలు



అమృత కలశాన్ని ఆశ్రమానికి తీసుకువస్తున్న సీతారామశర్మ

తెనాలి రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రుషికేష్ ప్రాంతానికి చెందిన గాయత్రిపీఠం నుండి 2400 తీర్థ జలలాతో మట్టితో నిక్షిప్తమైన అమృత కలశంను వివిధ ప్రాంతాల్లో పూజలందుకుంటూ గురువారం అంగలకుదురు చేరుకుంది. అమృత కలశాన్ని గ్రామంలోని ఆంధ్ర వాల్మీకి వాసుదాసు స్వామి పరంపర పీఠం దాసుకుట్టి ఆశ్రమంనకు గ్రామోత్సవంగా తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దేశంలోని గాయత్రి అమ్మవారి పీఠాలన్నింటిని దర్శించిన అనంతరం అమృత కలశాన్ని తిరిగి రుషీకేష్‌లోని గాయత్రిపీఠం వద్దకు చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు ఉలిచి సీతారామశర్మ తెలిపారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ వడ్డిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

ఇఫ్తార్‌లో పాల్గొనడం సంతోషంగా ఉంది

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్,మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషంగా ఉందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని పాండురంగపేటలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌లో ఆలపాటి పాల్గొని స్వయంగా వడ్డించారు. పలువురు ముస్లిం నాయకులు, కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌కు వీల్‌చైర్లు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

● జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి

తెనాలి రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రోగుల కోసం రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అందిస్తున్న సేవలు అభినందనీయమని తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి అన్నారు. గురువారం వైద్యశాలలో క్లబ్ ఆధ్వర్యంలో రోగులకు ఉపయోగపడేలా నాలుగు వీల్‌చైర్లను సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణికి క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, రోటరీ డిస్ట్రిక్ సభ్యుడు ఈదర వెంకటపూర్ణచంద్, గుత్త వెంకటరత్నం, రోటరీ సభ్యుడు గుమ్మడి ప్రసాద్, నల్లూరి వెంకటేశ్వరరావు, షేక్ సుభాని, కొత్తపల్లి సుబ్బారావు, కొల్లి రాజేంద్రప్రసాద్, పాలడుగు శ్రీనివాసరావు, సోమవరపు సాంబశివరావులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది, పలువురు క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యశాల సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి, దంత వైద్యనిపుణులు

దంత సంరక్షణపై అవగాహన ర్యాలీ

తెనాలి రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): దంత సంరక్షణతో అనేక వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి చెప్పారు. గురువారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వవైద్యశాల్లో వరల్డ్ ఓరల్ హెల్త్ డే కార్యక్రమం ద్వారా దంత సంరణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో దంత వైద్య నిపుణులు పలువురు పాల్గొన్నారు.



మున్నంగిలో ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్న కూలీలు

ఉపాధి కూలీలకు కొలతల ప్రకారం వేతనం

● ఏపీవో వెంకయ్య

కొల్లిపర, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కూలీలకు కొలతలు ప్రకారం వేతనం ఇవ్వడం జరుగుతుందని ఏపీవో వెంకయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, కొల్లిపర తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ పేద ప్రజలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు వల్లభాపురం బుజ్జిబాబు, కోటేశ్వరరావు, గోపి, నాగరాజు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

చంద్రబాబు, మందకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం

తెనాలి రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పట్టణంలోని చెంచుపేట ఇందిరా నగర్ కాలనీ టీడీపీ ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు సొపాటి కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిలకా కిరణ్ మాదిగ, ప్రసాద్, మహేష్, మనోజ్, తంగిరాల మనోజ్, బాలనాగమ్మ, ప్రసాద్ పలువురు టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీ ఆమోదించడంపై ఎమ్మార్పీఎస్ డివిజన్ మాజీ ఇన్‌చార్జి ఆళ్ళమూడి ప్రభాకరరావు హర్షం వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తక్కువ కాలంలోనే బిల్లును ఆమోదించేందుకు చర్యలు తీసుకోవడం మాదిగలపై చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చారని మాదిగలంతా ఆయనకు రుణపడి ఉంటామన్నారు.